# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి: 14 సంచిక: 12 | వరంగల్, 11-6-2026 , గురువారం | పేజీలు: 8 | వెల: 1.00


## ఆలేరులో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ప్రత్యేక గ్రామసభలు

ఆలేరు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక -- 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక లో భాగంగా ఆలేరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.




ఆదిలాబాద్, జూన్ 10 పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధితులతో ఫ్రెండ్లీగా ఉంటామని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌వ్యాఖ్యానించారు. రౌడీషీటర్లు, తదితర నేరస్తుల విషయంలో కఠినంగానే ఉంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది పెట్టే ఎవరినీ కూడా వదలబోమని స్పష్టం చేశారు. ఈరోజు (బుధవారం) ఆదిలాబాద్ జిల్లాలో డీజీపీ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తోషం గ్రామసభలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో నక్సలైట్ల సమస్య లేదని తెలిపారు.

దేశవ్యాప్తంగా ఏడాది కాలంలో రోడ్డుప్రమాదాల్లో..1.70 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని డీజీపీ చెప్పుకొచ్చారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్‌పై ప్రజలు యుద్ధం చేయాలని పిలుపునిచ్చారు. మైనర్ల డ్రైవింగ్.. దేశంలో పెద్ద సమస్యగా మారిందని తెలిపారు. తల్లిదండ్రులు వారికి వాహనాలు కొనిస్తున్నారని.. అందువల్లే ఇబ్బందులు వస్తున్నాయని వివరించారు. అన్నీ సమస్యలు పోలీసులతోనే పరిష్కారం కావని... ప్రజల సహకారం చాలా అవసరమని చెప్పుకొచ్చారు. భూపాలపల్లి, ఏటూరు నాగారం, నర్సంపేట, ఆదిలాబాద్ తదితర అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగు ఉందని ప్రస్తావించారు. గంజాయి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవని, రైతుబంధు కూడా నిలిపి వేస్తున్నామని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.




## కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు: పవన్ కల్యాణ్

ఢిల్లీ, జూన్ 10 ( జనసేన పార్టీ పెట్టిందే తెలంగాణలో అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. తెలంగాణలో తమ పార్టీకి లీడర్స్ ఉన్నారని.. కేడర్ ఉందని పేర్కొన్నారు. ఈరోజు (బుధవారం) ఢిల్లీ వేదికగా నేషనల్ మీడియాతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తెలంగాణలో లక్షన్నర మంది సభ్యత్వం జనసేనకు ఉందని ప్రస్తావించారు. వాళ్లు ఉత్సాహంగా ఉన్నప్పుడు.. వారి కోసం పనిచేయొద్దా? అని ప్రశ్నించారు.

కర్ణాటక, తమిళనాడులో ఉన్నవారి కోసం ఏమైనా చేయాలి కదా అని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర విభజనకు కాదని.. విభజన జరిగిన తీరుకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. తెలంగాణలోకి తనను రావొద్దనడం తన ప్రాథమిక హక్కుకి భంగం కలిగించినట్లేనని పేర్కొన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ఏనాడూ ఇలా మాట్లాడలేదని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని విమర్శించారు. '13 నెలలుగా నన్ను పర్సనల్‌గా టార్గెట్ చేస్తే.. తెలంగాణ మీ అయ్య జాగీరా అని అనడం తప్పా?' అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు.

## పీసా చట్టం.. ఆదివాసీల నిర్ణయాధికారానికి రక్షణ కవచం: మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 10: పీసా చట్టం ఆదివాసీల స్వాభిమానానికి ప్రతీక అని మంత్రి సీతక్క అన్నారు. గ్రామసభలను బలోపేతం చేసి గిరిజన హక్కులను కాపాడాలన్నారు. ఈరోజు(బుధవారం) రాజేంద్రనగర్‌లో పీసా చట్టం అమలుపై రెండు రోజుల రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించి... ప్రసంగించారు. పీసా చట్టంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు పూర్తి అవగాహన అవసరమని తెలిపారు. పీసా కేవలం చట్టం కాదని.. ఆదివాసీల స్వయం నిర్ణయాధికారానికి రక్షణ కవచమని వెల్లడించారు.



గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని.. గ్రామసభలే ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలని మంత్రి తెలిపారు. సహజ వనరులపై గ్రామసభల నిర్ణయాధికారాన్ని పీసా చట్టం కల్పించిందన్నారు. చట్టం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో చట్టవిరుద్ధ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజల అభిప్రాయాలను పక్కనబెట్టి కార్పొరేట్ల చేతుల్లోకి సహజ వనరులు వెళ్లకూడదన్నారు. పీసా చట్ట స్ఫూర్తిని అర్థం చేసుకుని అమలు చేసినప్పుడే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. సర్పంచులు గ్రామాభివృద్ధి నిర్ణయాల్లో కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధి గ్రామసభల బలోపేతంతోనే సాధ్యమని స్పష్టం చేశారు. గిరిజన హక్కుల పరిరక్షణ తనకు ప్రత్యేక బాధ్యతగా చెప్పుకొచ్చారు. ఉన్నవారి కోసం కాదు.. లేని వారి కోసం పనిచేయడమే ప్రజాసేవ అని అన్నారు.

పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదు..

గిరిజన ప్రాంతాల్లో ఇంకా ప్రాథమిక సదుపాయాల కొరత ఉందని సీతక్క వెల్లడించారు. గుట్టలు కరిగిపోతున్నాయని.. సహజ వనరులు క్షీణిస్తున్నాయన్నారు. గ్రామ పంచాయతీలు, గ్రామసభలను మరింత బలోపేతం చేయాలన్నారు. పీసా అమలులోని సవాళ్లకు వర్క్‌షాప్ చర్చలు పరిష్కార మార్గాలు చూపాలని తెలిపారు. 'సర్పంచ్ సంవాద్' ద్వారా 4,500 మంది సర్పంచులు ఒకే వేదికపైకి వచ్చారన్నారు. సాంకేతికతతో గ్రామీణ పాలనను మరింత సమర్థవంతం చేస్తున్నామని తెలిపారు. పీసా అమలు పుస్తకాలకే పరిమితం కాకూడదని.. గ్రామస్థాయిలో ఫలితాలు కనిపించాలన్నారు. ఆదివాసీల స్వపరిపాలన స్ఫూర్తిని కార్యరూపంలోకి తీసుకురావాలని తెలిపారు. పీసా చట్టం అమలుకు గ్రామసభల నిర్ణయాలకు గౌరవం కల్పించాలన్నారు. గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు పీసా చట్టం కీలకమని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## ఖర్గే సారథ్యంలో ఏఐసీసీ అత్యవసర సమావేశం 11న

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ అత్యవసరంగా సమావేశమవుతోంది. జూన్ 11న ఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పీసీసీ అధ్యక్షులు తప్పనిసరిగా ఈ సమావేశానికి హాజరుకావాలని పార్టీ అధిష్ఠానం ఆదేశించింది. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు.



ఏఐసీసీ అత్యవసర సమావేశం ప్రధాన ఎజెండా ఏమిటనేది పార్టీ అధిష్ఠానం ఆ సర్క్యులర్‌లో పేర్కొనలేదు. అయితే మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ్య నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చిన అంశం ప్రధానంగా ఈ సమావేశంలో చర్చకు రానుందని, దీనికి సంబంధించి భవిష్యత్ కార్యచరణపై సమావేశంలో చర్చించనున్నారని తెలుస్తోంది.

మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించడంతో కాంగ్రెస్ ప్రతినిధి బృందం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు బుధవారంనాడు కలిసి ఫిర్యాదు చేసింది. తక్షణం చర్యలు తీసుకోవాలని కోరింది. ఇది ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యని ఆరోపించింది. దీనిపై న్యాయపోరాటానికి కూడా కాంగ్రెస్ సిద్ధమవుతోంది. మరోవైపు మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురికావడంతో రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిగా నిలబెట్టిన మహేశ్ కావత్ విజయంపై బీజేపీ ధీమాగా ఉంది.



## రాహుల్ గాంధీని కలిసిన అభిషేక్ బెనర్జీ

న్యూఢిల్లీ: తృణమూల్ కాంగ్రెస్ (ఎంపీ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ బుధవారంనాడు న్యూఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ని కలిశారు. టీఎంసీలో నెలకొన్న రాజకీయ సంక్షోభం, ఎంపీల రాజీనామాల పర్వం కొనసాగుతున్న నేపథ్యంలో రాహుల్‌ను అభిషేక్ బెనర్జీ కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి ఒక రోజు ముందు కాంగ్రెస్ పార్లమెంటరీ చీఫ్ సోనియాగాంధీని ఆమె నివాసంలో టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ కలుసుకున్నారు. అందుకు కొనసాగింపుగానే అభిషేక్ బెనర్జీ రాహుల్‌ను కలుసుకున్నట్టు చెబుతున్నారు.

టీఎంసీలో చెలరేగిన తుపాను బుధవారంనాడు కూడా కొనసాగింది. ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ సుస్మితా దేవ్ తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆ వెంటనే అస్సాం ముఖ్యమంత్రి హింత బిశ్వశర్మను ఢిల్లీలో కలుసుకున్నారు. దీంతో ఆమె బీజేపీలో చేరే అవకాశం ఉందనే ఊహాగానాలు నెలకొన్నాయి. దీనికి ముందు ఈనెల 8న టీఎంసీ రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ రాజీనామా చేశారు. సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు తిరుగుబాటు చేయడంతో టీఎంసీలో చీలిక అనివార్యం కానుందనే ఊహాగానాల మధ్య రాజ్యసభ ఎంపీల రాజీనామా పర్వం కొనసాగుతుండటం ఆ పార్టీని ఆందోళనకు గురిచేస్తోంది.

ఇండియా కూటమి ఇటీవల న్యూఢిల్లీలో సమావేశమైన సమయంలోనే టీఎంసీ లోక్‌సభ ఎంపీల తిరుగుబాటు సంచలనమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీఎంసీ అగ్రనేతలు వరుసగా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వాన్ని కలుస్తున్నారు. అభిషేక్ బెనర్జీ, రాహుల్ సమావేశంలో ప్రధానంగా ఇండియా కూటమిలో సమన్వయం, టీఎంసీలో తిరుగుబాట్లు, పునరుద్ధరణ చర్యలపై చర్చించినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేల ఫోర్జరీ సంతకాల కేసులో ఈడీ సోదాల నేపథ్యంలో అభిషేక్ బెనర్జీని అరెస్టు చేసే అవకాశాలు కూడా ఉన్నాయనే ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి.

భారత శక్తి

# రైతు గుండెల్లో 'ఎల్ నినో' వణుకు..

ఈ వేసవిలో ఒకే ఆకాశం వైపు చూసే రెండు వేర్వేరు నగరాలు భిన్నమైన విధిని ఎదుర్కోబోతున్నాయి. ఒక నగరం చుక్క వర్షం కోసం అల్లాడిపోతుంటే, మరో నగరం జలమయమైపోనుంది. పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా బలపడుతున్న 'ఎల్ నినో' విపత్తు ప్రపంచ వాతావరణాన్ని పూర్తిగా మార్చేస్తోందని అంతర్జాతీయ వాతావరణ సంస్థ సంచలన హెచ్చరికలు జారీ చేసింది.ప్రపంచ వాతావరణ గమనాన్ని శాసించే పసిఫిక్ మహాసముద్రం ప్రస్తుతం తీవ్రమైన ఉష్ణోగ్రతతో రగిలిపోతోంది. దీనినే శాస్త్రవేత్తలు 'ఎల్ నినో' లేదా 'ఎన్సో' ఉష్ణ దశగా పిలుస్తారు. పసిఫిక్ మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. ఈ వేడి కారణంగా వర్షాన్ని మోసుకెళ్లే గాలుల దిశ మారిపోతుంది. ఫలితంగా కొన్ని ప్రాంతాల నుంచి మేఘాలు పూర్తిగా దూరమైపోతుంటే, మరికొన్ని ప్రాంతాలపైనే కేంద్రీకృతమై ముంచెత్తుతున్నాయి. 'నినో 3.4 ఇండెక్స్' ప్రకారం ఉష్ణోగ్రత 0.5 డిగ్రీల సెల్సియస్ దాటితేనే ప్రమాదకరం. అయితే ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు మధ్య ఇది ఏకంగా 1.8 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకోనుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.భారతదేశం ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన పొడి వాతావరణాన్ని, కరవు పరిస్థితులను ఎదుర్కోబోతోంది. భారత వాతావరణ శాఖ ( సమాచారంతో కూడిన అంతర్జాతీయ నివేదికల ప్రకారం.. ఈసారి దేశంలో సాధారణం కంటే చాలా తక్కువగా, అంటే కేవలం 90 శాతం మాత్రమే రుతుపవన వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందిముఖ్యంగా తెలుగు రాష్ట్రాల రాజధాని హైదరాబాద్‌తో పాటు దేశ రాజధాని ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మహానగరాల్లో వర్షాలు ముఖం చాటేయనున్నాయి. కేవలం ఈశాన్య భారత ప్రాంతాలు మాత్రమే ఈ ముప్పు నుంచి కొంతవరకు తప్పించుకోగలవని అంచనా. కేవలం భారత్‌లోనే కాదు.. ఆఫ్రికాలోని అడిస్ అబాబా, లాగోస్, బ్రెజిల్‌లోని రెసిఫే, ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్‌బోర్న్ నగరాలు కూడా చుక్క వాన కోసం ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది.ఎల్ నినో అంటే ప్రపంచవ్యాప్తంగా వర్షాలు ఆగిపోవడం కాదు.. వర్షం పడే ప్రాంతాలు మారిపోవడం. భూమిపై ఒకవైపు కరవు తాండవిస్తుంటే, మరోవైపు కొన్ని నగరాలు జలదిగ్బంధంలో చిక్కుకోనున్నాయి. సాధారణంగా అత్యంత పొడిగా ఉండే ఈక్వెడార్ తీర ప్రాంతాల్లో ఈసారి భారీ వర్షాలు కురవనున్నాయి. అలాగే దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్, హరారే వంటి నగరాల్లో శీతాకాలంలో ఊహించని రీతిలో రికార్డు స్థాయి కుండపోత వర్షాలు పడతాయని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు."ఎల్ నినో ప్రభావం కేవలం పసిఫిక్ సముద్రానికే పరిమితం కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజల ఆహార భద్రతను, తాగునీటి లభ్యతను, జీవనోపాధిని దెబ్బతీస్తుంది" అని అంతర్జాతీయ వాతావరణ సంస్థ సెక్రటరీ జనరల్ సెలెస్టే సౌలో స్పష్టం చేశారు. రాబోయే మూడు నెలలు ప్రపంచంలోని వివిధ నగరాలకు అత్యంత కీలకమైనవి. ప్రభుత్వాలు ఇప్పటి నుంచే నీటి సంరక్షణ, కరవు నివారణ చర్యలు చేపట్టకపోతే తీవ్ర ఇబ్బందులు తప్పవు.నైరుతి రుతుపవనాలు పశ్చిమ తీరం వెంబడి, అంతర్గత ద్వీపకల్పంలోకి చకచకా అడుగులు వేస్తున్నాయి. ఇప్పటికే గోవా మొత్తాన్ని చుట్టేసిన ఈ పవనాలు.. కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలకు విస్తరించాయి. తమిళనాడులోని మెజారిటీ ప్రాంతాలతో పాటు ఈశాన్య రాష్ట్రాలైన మిజోరాం, మణిపూర్‌లలో కూడా ఇవి ప్రవేశించాయి. భారత వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రుతుపవనాల ఉత్తర పరిమితి ప్రస్తుతం మహారాష్ట్రలోని దేవ్‌గఢ్, కర్ణాటకలోని కొప్పల్, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం మీదుగా చెన్నై, ఐజ్వాల్ వరకు సాగుతోంది. రాబోయే రెండు మూడు రోజుల్లో మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మరికొన్ని ప్రాంతాలకు ఇవి పూర్తిగా విస్తరించడానికి వాతావరణం ఎంతగానో అనుకూలంగా ఉంది. ప్రస్తుతం మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మీదుగా దట్టమైన కారుమేఘాలు కమ్ముకున్నాయి. ఈ ప్రాంతాల్లో రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి ఇవి స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయి. భానుడి భగభగలకు అల్లాడిన భూమి, ఈ మేఘాల రాకతో చల్లబడనుంది. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో ముందస్తు వర్షాలు కూడా మొదలయ్యాయి.రుతుపవనాల రాక సంతోషాన్నిస్తున్నప్పటికీ, అంతర్జాతీయ వాతావరణ సూచీలు ఇస్తున్న సంకేతాలు శాస్త్రవేత్తలను, వ్యవసాయ రంగ నిపుణులను కలవరపెడుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్ నినో పరిస్థితులు రోజురోజుకూ బలపడుతున్నట్లు అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఎల్ నినో ప్రభావం గనుక పెరిగితే, అది రుతుపవనాల తీవ్రతను తగ్గించి, దేశంలో వర్షపాతాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఎల్ నినో కాలంలో రుతుపవనాలు సకాలంలో వచ్చినప్పటికీ, మధ్యలో సుదీర్ఘ పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇది విత్తనాలు వేసి ఆశగా ఎదురుచూసే రైతులకు పెద్ద శాపంగా మారుతుంది. ముఖ్యంగా వర్షాధార పంటలపై ఆధారపడే మెజారిటీ భారతీయ వ్యవసాయ రంగానికి ఇది గండంగా మారే అవకాశం ఉంది.రుతుపవనాల ముందడుగు ప్రస్తుతానికి ఊరటనిస్తున్నా, ముంచుకొస్తున్న ఎల్ నినో ముప్పును తక్కువగా అంచనా వేయలేం. రాబోయే రోజుల్లో వర్షాల విస్తరణ, వాటి తీవ్రతను బట్టే ఈ ఏడాది దేశ వ్యవసాయ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. రైతాంగం వాతావరణ శాఖ సూచనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, తదనుగుణంగా పంటల ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం అత్యంత అవసరం

# దేవినేని, వంగవీటి కు కలిసి రాని కాలం



విజయవాడ. జూన్ 10

విజయవాడలో ఒకప్పుడు దేవినేని కుటుంబం రాజకీయాలకు పెట్టింది పేరు. దేవినేని రాజశేఖర్ జీవించి ఉన్న సమయంలో ఆయన నగర రాజకీయాలను తన గుప్పిట్లో పెట్టుకునేవారు. ఆయన ఏ పార్టీలో ఉన్నప్పటికీ బెజవాడలో ఆయనదే పై చేయి అయ్యేది. కొన్ని దశాబ్దాల కాలం పాటు దేవినేని కుటుంబం బెజవాడ రాజకీయాలను శాసించిందనే చెప్పాలి. కానీ దేవినేని నెహ్రూ మరణించిన తర్వాత మాత్రం ఆ కుటుంబానికి రాజకీయంగా కలసి రావడం లేదు. ఆయన కుమారుడు దేవినేని అవినాష్ ఎన్నిసార్లు పోటీ చేసినా ఇప్పటి వరకూ ఎన్నికల్లో విజయం సాధించలేదు. నెహ్రూ కు గెలుపులు పలకరిస్తే అవినాష్ ను ఓటములు కౌగలించుకుంటున్నాయి.నిజానికి దేవినేని అవినాష్ తెలుగుదేశం పార్టీ, వైసీపీ అంటూ పార్టీలు మార్చారు. ఏ పార్టీలో ఉన్నప్పటికీ దేవినేని అవినాష్ కష్టపడతారన్న పేరుంది. నిత్యం ప్రజల్లో ఉండేందుకే ప్రయత్నిస్తారంటారు. కానీ ఆయనకు పొలిటికల్ గా లక్కు కలసి రావడం లేదు. తన తండ్రి నెహ్రూ జీవించి ఉన్న సమయంలో కాంగ్రెస్ అభ్యర్థిగా విజయవాడ ఎంపీగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత దేవినేని అవినాష్ టీడీపీలో చేరారు. 2019 ఎన్నికల్లో గుడివాడలో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం తిరిగి వైసీపీలోకి మారారు. 2024 ఎన్నికల్లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి పోటీ చేసి మరోసారి అవజయాన్ని మూటగట్టుకున్నారు.దేవినేని అవినాష్ ఈసారి కూడా నియోజకవర్గం మార్చబోతున్నారు. దేవినేని నెహ్రూ కుమారుడిగా రాజకీయాల్లోకి వచ్చిన దేవినేని అవినాష్ ఇప్పటి వరకూ చట్టసభల్లో అడుగు పెట్టలేదు. దీంతో తన తండ్రి గతంలో ప్రాతినిధ్యం వహించిన కంకిపాడు (అప్పట్లో) నియోజకవర్గం, ఇప్పుడు పెనమలూరు నియోజకవర్గంపై ఆయన దృష్టి పెట్టినట్లు తెలిసింది. తూర్పు నియోజకవర్గం కంటే తనకు పెనమలూరు నియోజకవర్గం బెటర్ అని దేవినేని అవినాష్ భావిస్తున్నారు. పెనమలూరు అయితే తన గెలుపు గ్యారంటీ అన్న నమ్మకంతో ఉన్నా? పెనమలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. తన తండ్రి దేవినేని నెహ్రూ గతంలో కంకిపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయడంతో అక్కడ తనకు బలమైన ఓటు బ్యాంకు ఉందనినమ్ముతున్నారు. మరి ఈసారైనా గెలుపు దేవినేని అవినాష్ ను పలకరిస్తుందా? లేదా? అన్నది చూడాలి.

పాపం వంగవీటి

బెజవాడ రాజకీయాలను వంగవీటి కుటుంబాన్ని వేరు చేసి చూడలేం. వంగవీటి రంగాకు ఇప్పటికీ విజయవాడ నగరంలో అభిమానులు, ప్రత్యేక అభిమానులు ఉన్నారు. కానీ ఆయన మరణానంతరం మాత్రం వంగవీటి కుటుంబానికి రాజకీయాలు అచ్చిరావడం లేదు. రంగా లెగసీని వారసులు అందిపుచ్చుకోలేకపోతున్నారు. ఒకరకంగా రంగా అభిమానులకు ఆవేదన కలిగించే విషయం. వంగవీటి రంగా హత్య తర్వాత ఆ కుటుంబంలో ఎవరికీ రాజకీయాలు పెద్దగా కలసి వచ్చినట్లు కన్పించడం లేదు. ఒకసారి రంగా సతీమణి రత్నకుమారి, మరొకసారి కుమారుడు వంగవీటి రాధా ఎమ్మెల్యేగా గెలవడం తప్పించి తర్వాత గెలుపు దక్కలేదు. ఎన్ని పార్టీలు మారి ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు.దశాబ్దాల కాలం నుంచి రాజకీయ పదవులకు వంగవీటి కుటుంబం దూరంగానే ఉంటుంది. 2019 ఎన్నికలకు ముందు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వంగవీటి రాధాకు నాడు టిక్కెట్ కూడా దొరకలేదు. 2024 ఎన్నికల్లోనూ ఆయనకు ఎక్కడా టిక్కెట్ కేటాయించలేదు.తాజాగా రాజ్యసభ ఎన్నికల్లోనూ ఛాన్స్ దొరుకుతుందని భావిస్తే ఆ పేరు



కనిపించలేదు. వంగవీటి రాధాను సామాజిక కోణంలోనూ ఖచ్చితంగా పదవి లభిస్తుందని భావించినప్పటికీ ఆయనకు మాత్రం తిరిగి నిరాశ ఎదురయింది. ఇప్పటికే రెండు ఎన్నికలకు దూరంగా ఉన్న వంగవీటి రాధా ఈసారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నదిమాత్రం ఆసక్తికరంగా మారింది. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో బొండా ఉమామహేశ్వరరావు ఉండటంతో ఆయనను కాదని రాధాకు టిక్కెట్ ఇచ్చే అవకాశాలు లేవు.ఇక ఒకే ఒక ఆశ ఉంది. 2029 ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే బెజవాడలో ఒక సీటును ఏదైనా సీటును ఇస్తారేమోనన్న ఆశ మిణుకుమిణుకులా కనిపిస్తుంది. అదేసమయంలో రానున్నకాలంలో ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ అయితే వంగవీటి రాధాకు ఇస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ పోస్టులు భర్తీ చేసే సమయానికి రాధా పేరు ఉంటుందో? లేదో? అన్న టెన్షన్ వంగవీటి అభిమానుల్లో ఉంది. వంగవీటి రాధా 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి ఓటమిపాలయ్యారు. 2014లో వైసీపీలో చేరారు. అప్పుడూ ఓటమి పాలయ్యారు.2019 ఎన్నికలకు ముందు ఆయన టీడీపీలో చేరినా ఫలితం కనిపించలేదు. మొత్తం మీద బెజవాడ రాజకీయాల నుంచి వంగవీటి కుటుంబం ఇలా ఎగ్జిట్ కావడం రంగా అభిమానులను ఆవేదనకు గురిచేస్తుం

# ఏపీకి 30 వేల కోట్ల ప్రాజెక్టు...

విజయవాడ. జూన్ 10 (

ఏపీకి మరో భారీ ప్రాజెక్టు రానుందా అంటే అవుననే వినిపిస్తోంది. తమిళనాడులోని తూత్తుకుడిలో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని భావించిన మజ్‌గావ్ డాక్ లిమిటెడ్ ఇప్పుడు ఏపీవైపు దృష్టి సారించినట్లు సమాచారం. తూత్తుకుడి ప్రాజెక్టు కోసం తమిళనాడు ప్రభుత్వంతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. అయితే ఆ తర్వాత తమిళనాడు సర్కారు నుంచి సరైన స్పందన లేకపోవటంతో ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.ఏపీలో రూ.29 వేల కోట్లు పెట్టుబడులు పెట్టే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రాబోతోందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. మనదేశంలోనే ప్రముఖ నౌకా నిర్మాణ సంస్థ మజ్‌గావ్ డాక్ లిమిటెడ్ ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తోంది. తమిళనాడులోని తూత్తుకుడిలో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటు కోసం ఆ రాష్ట్రానికి గతంలో ప్రతిపాదనలు చేసింది ఎండీఎల్. అయితే దీనిపై తమిళనాడు ప్రభుత్వం నుంచి స్పందన రాకపోవటంతో.. ఇప్పుడు ఏపీవైపు దృష్టి సారించినట్లు వార్తలు వస్తున్నాయి. తూత్తుకుడిలో మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్ ప్రాజెక్టు కోసం 2025 సెప్టెంబర్ నెలలో మజ్‌గావ్ డాక్ లిమిటెడ్ తమిళనాడు ప్రభుత్వంతో ఒక ఒప్పందం చేసుకుంది.అలాగే 2025-26 ఆర్థిక సంవత్సరం రెండవ త్రైమాసిక ఫలితాల సమీక్షా సమావేశంలో బోర్డు ఆమోదం తర్వాత, ఈ ప్రాజెక్ట్ కోసం రూ.15 వేలకోట్ల నుంచి రూ.18 వేలకోట్ల వరకూ పెట్టుబడులు పెడతామని ఎండీఎల్ సంస్థ ప్రకటించింది.3,00,000 ఆచి సామర్థ్యంతో.. అతిపెద్ద ముడి చమురు రవాణా నౌకల అవసరాలను తీర్చే ఉద్దేశంతో.. 1,050 ఎకరాల విస్తీర్ణంలో గ్రీన్ ఫీల్డ్ షిప్ యార్డ్‌ను పది నుంచి 12 ఏళ్లలో అభివృద్ధి చేసే ప్రణాళికకు ఆమోదం తెలిపింది.అయితే వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఈ క్లస్టర్ ప్రాజెక్టు కోసం తమిళనాడు ప్రభుత్వం ఒక విదేశీ కంపెనీని తీసుకువచ్చిందని వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మజ్‌గావ్ డాక్ లిమిటెడ్ తనకు ఉన్న ప్రత్యా?మ్నాయ మార్గాలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. ఈ క్రమంలోనేఆంధ్రప్రదేశ్‌లో భారీ నౌకా నిర్మాణ క్లస్టర్ ఏర్పాటు కోసం రూ.29,000 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాలని ఎండీఎల్ యోచిస్తోంది. ఇందులో భాగంగా సాధ్యాసాధ్యాలపై అధ్యయనం జరిపేందుకు ఎండీఎల్ బృందం త్వరలోనే ఏపీలో పర్యటించనున్నట్లు సమాచారం.

ఏం జరిగిందంటే..

2025 సెప్టెంబర్ 19న.. తూర్పు తీర ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ షిప్ యార్డ్ ఏర్పాటు చేసేందుకు మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్ ఎంవోయూ చేసుకుంది. తూత్తుకుడిలో గ్రీన్ ఫీల్డ్ షిప్ యార్డులు ఏర్పాటు చేసేందుకు ఎండీఎల్‌తో పాటుగా కొచ్చిన్ షిప్ యార్డు కూడా తమిళనాడు ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకుంది. రెండూ కలిసి రూ.30 వేలకోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఇక గతేడాది నవంబర్ నెలలో జరిగిన బోర్డు సమావేశంలో తూత్తుకుడిలో రూ.15000 వేలకోట్లు నుంచి రూ.18 వేలకోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎండీఎల్ ప్రకటించింది. అప్పటి నుంచి స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం నుంచి ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్ కోసం ఎదురుచూస్తోంద గతేడాది ఆఖర్లో జరిగిన తమిళనాడు రైజింగ్ ఇన్‌వెస్ట్‌మెంట్ కాంక్లేవ్‌లోతి అనే విదేశీ కంపెనీ తూత్తుకుడిలో షిప్ యార్డ్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. అలాగే తమిళనాడు ప్రభుత్వంతో ఎక్స్ క్లూజివ్ బిజినెస్ కోపరేషన్ అగ్రిమెంట్ కూడా కుదుర్చుకుంది. దీంతో మజ్‌గావ్ డాక్ ప్రత్యామ్నాయంగా ఏపీవైపు దృష్టి సారించినట్లు సమాచారం.

# ఉత్తరాంధ్రలో లోకేష్ టీమ్

విజయనగర. జూన్ 10

ఏపీ రాజకీయాల్లో ఉత్తరాంధ్ర కీలకం. ఉత్తరాంధ్రలో ఏ పార్టీ మెజారిటీ సీట్లు దక్కించుకుంటే అదే పార్టీ అధికారంలోకి రాగలదు. ప్రధానంగా ఉత్తరాంధ్రలో బిసి వర్గాలు అధికం. మత్స్యకారులు కూడా ఉన్నారు. గిరిజనులు కూడా నివసిస్తున్నారు. అయితే ప్రతి రాజకీయ పార్టీ ఉత్తరాంధ్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుంది. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ కూడా అదే పనిలో ఉంది. ఉత్తరాంధ్రలో యువనాయకత్వానికి ప్రోత్సాహం అందించడం ద్వారా.. వచ్చే ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించాలని చూస్తోంది. ఆపై తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి.. మరో నాలుగు దశాబ్దాల పాటు అవసరమైన నాయకత్వాన్ని అందించాలని భావిస్తోంది. అందులో భాగమే చింతకాయల విజయ్ కు రాజ్యసభ పదవి. ఒక్క మాటలో చెప్పాలంటే లోకేష్ టీం ఉత్తరాంధ్రలో రంగంలోకి దిగిందన్నమాట. 2024 ఎన్నికల తరువాత తీసుకున్న నిర్ణయాలు చూస్తే టిడిపి యువతకు పెద్దపీట వేసినట్టేకచ్చితంగా తెలుగుదేశం పార్టీలో యువనేతల్లో లోకేష్ తర్వాత ఎవరు? అంటే ముందుగా గుర్తొచ్చేది కింజరాపు రామ్మోహన్ నాయుడు. పార్టీలో కూడా విపరీతమైన ఇమేజ్ సొంతం చేసుకున్నారు రామ్మోహన్ నాయుడు. కేవలం యువనేతలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో శ్రీకాకుళం పార్లమెంటు స్థానం నుంచి మూడోసారి గెలిచిన రామ్మోహన్ నాయుడుకు కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించారు. కీలకమైన పౌర విమానయాన శాఖను అందించారు. మరోవైపు మొన్నటి ఎన్నికల్లో గజపతినగరం నుంచి యువకుడైన కొండపల్లి శ్రీనివాస్ కు అవకాశం ఇచ్చారు. రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ఇప్పుడు ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చింతకాయల విజయ్ ను రాజ్యసభకు పంపించారు. ఉత్తరాంధ్రలో బలోపేతం కావడంతో పాటు టిడిపికి భవిష్యత్తు నాయకత్వం అందించేందుకుగాను ఈ నిర్ణయాలు అన్నట్టు ఉన్నాయి. వీరు మాత్రమే కాదు దాదాపు నేతల వారసులందరికీ ఛాన్స్ అందించింది టిడిపిఉత్తరాంధ్రలో మొత్తం 34 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఐదు వరకు పార్లమెంటు సీట్లు కూడా ఉన్నాయి. మొన్నటి ఎన్నికల్లో 32 అసెంబ్లీ సీట్లను కైవసం చేసుకుంది టిడిపి కూటమి. నాలుగు పార్లమెంటు స్థానాలను దక్కించుకుంది. అయితే ఇదే దూకుడు కొనసాగాలి అంటే యువనాయకత్వం రావాలి అన్న ఆలోచనలో టిడిపి ఉంది. అందుకే కింజరాపు రామ్మోహన్ నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, చింతకాయల విజయ్ వంటివారికి ఎనలేని ప్రాధాన్యమిస్తోంది. పైగా వీరంతా లోకేష్ టీమ్ గా ముద్ర ఉంది. ఆముద్రను బలంగా చాటుకోవాలని భావిస్తోంది. గతంలో చంద్రబాబు నాయుడుకు వలయంగా ఉండేవారు కింజరాపు ఎర్రన్నాయుడు, కళా వెంకట్రావు, అయ్యన్నపాత్రుడు, అశోక్ గజపతిరాజు లాంటివారు. ఇప్పుడు వారు వారసులు రంగంలోకి వచ్చారు లోకేష్ కోసం. మొత్తానికైతే చాప కింద నీరులా లోకేష్ టీం విస్తరిస్తోంది ఉత్తరాంధ్రలో..

# విశాఖలో కార్డేలియా క్రూయిజ్ విహారం

విశాఖపట్టణం. జూన్ 10 పర్యాటకులకు పండగ లాంటి వార్త. విశాఖలో కార్డేలియా క్రూయిజ్ విహారానికి సిద్ధమైంది. జూన్ 22 నుంచి జూలై 15వ తేదీ వరకూ సముద్రంలో విహరించే అవకాశం మీ ముందు ఉంది. ఈ వివరాలను ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ వెల్లడించింది. ఇక ఈసారి విశాఖ నుంచి చెన్నైకు నాలుగుసార్లు, చెన్నై నుంచి విశాఖకు నాలుగుసార్లు కార్డేలియా క్రూయిజ్ షిప్ విహరించనుంది.తెల్లారి లేచింది మొదలు ఉరుకుల పరుగుల జీవితం.. ఈ కాంక్రీట్ జంగిల్‌లో మనిషన్నవాడు కాస్తా మెషీన్‌గా మారిపోతున్నాడు. రూపాయి వెంట పరుగులతో లైఫ్ స్టైల్ మారి.. అసలైన జీవితాన్ని మర్చిపోతున్నాడు. ఉన్నది ఒకటే జిందగీనని మరిచి.. ప్రతిక్షణాన్ని ఆస్వాదించాలనే విషయాన్ని విస్మరిస్తున్నాడు. మీరు కూడా ఇలాంటి రొటీన్ బోరింగ్ లైఫ్ స్టైయిల్‌తో అలసిపోయారా.. వెనక్కి తిరిగి చూస్తే ఉద్యోగం, జీతం తప్ప జీవితం లేదని భావిస్తున్నారా.. అలాంటి వారికో అద్భుత అవకాశం.. రోజువారీ పనులను పక్కనబెట్టి, సరదాగా విహరించాలనుకునేవారికి మంచి ఛాన్స్. విలాసవంతమైన భారీ క్రూయిజ్ షిప్‌లో సముద్రంలో విహరించే అవకాశం ఇప్పుడు మీముందు ఉంది. విశాఖపట్నంలో కార్డేలియా క్రూయిజ్ షిప్ విహారం ఈ నెల నుంచి మొదలుకానుంది. ఈ విషయాన్ని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయమోహన్ వెల్లడించారు. ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్యక్షుడు.. కార్డేలియా క్రూయిజ్ షిప్ విహారం వివరాలను వెల్లడించారు. జూన్ 22 నుంచి జులై 15 వరకూ ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. జూన్ 22వ తేదీన కార్డేలియా క్రూయిజ్ చెన్నై నుంచి బయల్దేరుతుంది. జూన్ 24వ తేదీ విశాఖపట్నానికి చేరుకుంటుంది. ఇక ఈ సంవత్సరం విశాఖపట్నం నుంచి చెన్నైకు నాలుగు సార్లు, చెన్నై నుంచి విశాఖకు నాలుగుసార్లు ప్రయాణించనుంది కార్డేలియా క్రూయిజ్ షిప్.ఈ క్రూయిజ్ షిప్ టూర్ కోసం ఎంత ఛార్జీలను వసూలు చేస్తారనే వివరాలను టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ వెల్లడించింది.ఈ భారీ నౌకలో ఇద్దరు, రెండు రాత్రుళ్లు ప్రయాణించేందుకు రూ.48 వేల వరకూ ఖర్చు అవుతుందని తెలిపారు. అలాగే మూడు రాత్రులు ప్రయాణించేందుకు ఇద్దరికి రూ.70 వేలు ఖర్చు అవుతుందని వివరించారు. ఇక కార్డేలియా క్రూయిజ్ షిప్ టూర్‌కు సంబంధించిన టికెట్లు అన్ని ట్రావెల్ ఏజెన్సీలలోనూ దొరుకుతాయని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ తెలిపింది.కార్డేలియా క్రూయిజ్ 692 అడుగుల పొడవు ఉంటుంది. ఇందులో మొత్తం 11 అంతస్తులు, 796 కేబిన్లు ఉంటాయి. ఒకేసారి 1,600 మంది ప్రయాణికులు ఇందులో ప్రయాణించే వీలుంది. ఇక కార్డేలియా క్రూయిజ్ నౌక లోపల స్టేట్ రూం, సముద్రం చూసేందుకు వ్యూ క్యాబిన్లు, సూట్ రూమ్స్, బాల్కనీ క్యాబిన్, ఛైర్మన్ సూట్ వంటివి అందుబాటులో ఉంటాయి. 2022లో తొలిసారిగా కార్డేలియా క్రూయిజ్ విశాఖ చెన్నై మధ్య సముద్రంలో విహరించింది. అప్పటి నుంచి ఈ నౌక ప్రయాణం ఎప్పుడు మొదలవుతుందా అని పర్యాటకులు ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు.

# ప్రమాదంలోనూ... రాజకీయమా

విశాఖపట్టణం,జూన్ 10

స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్లిలాంటిదే అన్నట్టుగా వైసీపీ నాయకులకు ఎక్కడ ఎలా వ్యవహరించాలో తెలియడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం జరిగి 8 మంది మృతి చెందిన విషయం రాష్ట్ర వ్యాప్తంగా అందరినీ కలిచి వేస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన మంత్రి నారా లోకేష్.. వారిలో భరోసా నింపే ప్రయత్నం చేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.కానీ.. దీనిని కూడా వైసీపీ నాయకులు రాజకీయాలకు వాడేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. వాస్తవానికి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరూ కలివిడిగా వ్యవహరించి..బాధితులకు అండగా.. వారికి భరోసా కల్పించేలా వ్యవహరించాలి. కానీ, దీనికి భిన్నంగా వైసీపీ నాయకులు నారా లోకేష్ పర్యటనపై విమర్శలు చేశారు. బాధిత కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాలన్న కార్మిక సంఘాలను నారా లోకేష్ ఏదో అన్నారని.. లోకేష్ నియంతలా వ్యవహరిస్తున్నారని వైసీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యానించారు.వాస్తవానికి కార్మికుల పక్షాన, ఉద్యోగుల పక్షాన, మరీ ముఖ్యంగా బాధితుల పక్షాన నిలబడడాన్ని ఎవరూ తప్పు బట్టరు. ప్రభుత్వాన్ని ప్రశ్నించవద్దని కూడా ఎవరూ అనరు. అంతేకాదు.. బాధితులకు సాధ్యమైనంత ఎక్కువ మొత్తంలో పరిహారం ఇప్పించే ప్రయత్నం చేయడాన్ని కూడా ఎవరూ తప్పుగా చూడరు. వైసీపీ స్థానంలో టీడీపీ ఉన్నా.. బాధితుల పక్షానే నిలబడుతుంది. కానీ.. దీనికి కూడా సమయం, సందర్భం అంటూ ఒకటి ఉంటుంది. విశాఖ ప్లాంట్ ఘటనలో తప్పు ప్రభుత్వానిదా? అంటే కాదు.ఇది ప్రమాదవశాత్తు జరిగిందని సాక్షాత్తూ కేంద్ర మంత్రే చెప్పారు. పోనీ.. ఈఘటన.. ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనల కారణంగా జరిగిందా? అంటే.. దీనికి రాష్ట్ర సర్కారుకు సంబంధం లేదు. అయినప్పటికీ.. ఈ ఘటనను ప్రభుత్వానికి, ముఖ్యంగా మంత్రి లోకేష్‌కు ముడిపెట్టి.. గుడివాడ అమర్నాథ్ వ్యాఖ్యలు చేయడం.. బాధితులను పరామర్శించడాన్ని కూడా తప్పుపట్టేలా మాట్లాడడం వంటివి సరికాదని అంటున్నారుఏదైనా ఉంటే.. సమయం చూసుకుని ప్రభుత్వానికి సూచనలు చేయొచ్చని.. ప్రతిపక్ష(ప్రధానకాదు) పార్టీగా వైసీపీ తరఫున కూడా బాధితులను ఆదుకునేందుకు ప్రయత్నించవచ్చని చెబుతున్నారు. కానీ, ఈ బాధ్యతలను మరిచిన గుడివాడ.. మీడియా సమావేశాలు పెట్టి మంత్రిని విమర్శించడమే పనిగా పెట్టుకోవడంపై విశాఖ వాసులే.. నవ్విపోతున్నారు

టీడీపీ, జనసేన

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు.. కూటమి ప్రభుత్వంలో కీలక రోల్ పోషిస్తున్న విషయం తెలిసిందే. జనసేన పార్టీ అధినేతగా పవన్ కల్యాణ్, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ వ్యవహరిస్తున్నారు. తాజాగా తొలిసారి ఒకే సమయంలో ఇద్దరు నేతలుకూడా విశాఖలో పర్యటించారు. సోమవారం సాయంత్రం విశాఖలోని స్టీల్‌ప్లాంట్ జరిగిన ఘోర ప్రమాదంలో 8 మంది మృతి చెందడం తో పాటుపలువురు గాయపడ్డారు. వీరిని పరామర్శించేందుకు ఇరువురు నాయకులు విశాఖలో పర్యటించారు.రష్యా పర్యటనకు వెళ్లిన.. మంత్రి నారా లోకేష్.. ఈ రోజు ఉదయమే.. హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయన విదేశీ పర్యటన బడలికతో మంగళవారం రెస్ట్ తీసుకోవాలని, కుటుంబ సభ్యులతో గడపాలని అనుకున్నారు. కానీ, విశాఖలో జరిగిన దుర్ఘటనతో ఆయన ఉదయం 10 గంటలకే హైదరాబాద్ నుంచి నేరుగా విశాఖకు చేరుకున్నారు. ఇక, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. కూడా మంగళగిరి నుంచి నేరుగా విశాఖకు చేరుకుని.. బాధితులను పరామర్శించారు.విశాఖ స్టీల్ ప్లాంట్ బాధితుల పరామర్శకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు వచ్చినా.. ఇద్దరూ ఎలాంటి గందరగోళానికి తావివ్వకుండా.. పనిని పంచుకున్నట్టు స్పష్టమైంది. మంత్రి లోకేష్.. నేరుగా ఈ ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లారు. వారితో మాట్లాడి.. ఓదార్చారు. వారితో కలిసి కూర్చుని వారి బాధను పంచుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం నూరిపోశారు.ఇక, పవన్ కల్యాణ్.. మంగళగిరి నుంచి నేరుగా విశాఖకు చేరుకున్నా.. అక్కడి నుంచి ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లారు. వారిని పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యాన్ని, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులతో నేరుగా మాట్లాడి వారి నుంచి కొంత సమాచారం తెలుసుకున్నారు. వారికి ధైర్యం చెప్పారు.ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. కాగా.. ఇరువురు నేతలు.. వేర్వేరుగా మీడియాతో మాట్లాడారు. నిజానికి ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు నాన్ ప్లాన్‌గా వ్యవహరించే పరిస్థితి ఉంటుంది. కానీ, పవన్, లోకేష్‌లు బాధితుల పరామర్శలో భాగం అయ్యే విషయంలో జాగ్రత్తలు తీసుకుని విమర్శలకు తావులేకుండా వ్యవహరించారు.

# మారిన నియోజక వర్గాల లెక్కేంటీ

విజయవాడ,జూన్ 10

గత ఎన్నికల సమయంలో కొందరు నాయకులు పోటీ చేసిన నియోజకవర్గాల్లో వారు ఓడిపోయారు. అయితే.. ఆ తర్వాత పలువురు నేతలు.. పార్టీ మారారు. అలాంటి నియోజకవర్గాల్లో ఇప్పటికీ వైసీపీ రాజకీయాలు ఒకదారికి రాకపోవడం గమనార్హం. ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని సరిదిద్దాలన్న సూచనలు వస్తున్నా.. ఇప్పటికీ.. పార్టీ అధిష్టానం పట్టించుకోకపోవడం గమనార్హం. దీంతో ఇప్పుడు వాటి పరిస్థితి ఏంటనేది వైసీపీలో చర్చనీయాంశంగా మారింది.జగ్గయ్యపేట.. ఈ నియోజకవర్గంలో పోటీ చేసిన సామినేని ఉదయభాను.. గత ఎన్నికల తర్వాత జనసేన తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఇక్కడ వైసీపీ తరఫున పెద్దగా పట్టించుకునే నాయకులు కనిపించడం లేదు. ఇది పార్టీకి.. స్థానిక కేడర్‌కు కూడా ఇబ్బందిగానే మారింది. తూర్పుగోదావరి జిల్లా రాజోలు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన గొల్లపల్లి సూర్యారావు కూడా ఓడిపోయారు. ఆ తర్వాత ఆయన నియోజకవర్గాన్ని వదిలేశారు. ఇక్కడ కూడా పార్టీ ఇబ్బందులు పడుతోంది.గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కూడా వైసీపీకి ఎదురు గాలి వీస్తోంది. మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి.. మేకతోటి సుచరిత గత ఎన్నికల్లో తాడికొండ నుంచి పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఆ తర్వాత.. ఆమె.. తిరిగి ప్రత్తిపాడుకు వెళ్లిపోయారు. కానీ, దూకుడుగా వ్యవహరించలేక పోతున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. పైగా.. ఆమె పార్టీ మార్పుపై కొన్నాళ్ల కిందటే చర్చ వచ్చినా.. మౌనంగా ఉన్నారు. ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు.

# కోటరీ దోపిడి.. జగన్ షాక్

విజయవాడ. జూన్ 10

వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో జగన్మోహన్ రెడ్డి చుట్టూ ఒక కోటరీ ఉండేది. జగన్ సైతం వారినే నమ్మేవారు. వారు కూడా ఆర్థికంగా బలపడ్డారు. అయితే ఇప్పుడు అలా చుట్టూ ఉన్న నేతల అవినీతి బయటపడుతోంది. తనకు తెలియకుండా ఇంత అవినీతి చేశారా అన్నట్టు.. ఒక్కో లెక్క బయటకు వస్తోంది.. దీంతో ప్యాలెస్ లోపల తీవ్ర అప నమ్మకం, నిశ్శబ్దం కనిపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తన పేరుతో దోపిడీ చేసి.. తనకు మాత్రం సగం కూడా ఇవ్వలేదని అంతిమ లబ్ధిదారుడు బాధపడుతున్నారట. కేవలం ఒకరు ఎంత పోగేసుకున్నారో.. ప్రత్యేక దర్యాప్తు బృందం లెక్కలు చెప్పడంతో తాడేపల్లి కోటరిలో ప్రకంపనలు రేగినట్లు తెలుస్తోంది . ఒకప్పుడు జగన్ చుట్టూ ఉంటూ.. పార్టీతో పాటు ప్రభుత్వ నిర్ణయాలను శాసించిన ఈ కోటరి పూర్తిగా చెల్లాచెదురయ్యింది. అయితే ఈ కోటరిలో క్రియాశీలక పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి ముందుగానే బయటకు వెళ్లిపోయారు. అలా అనేదానికంటే జగన్మోహన్ రెడ్డి ఆయనను పక్కన పడేశారుఅధికారం కోల్పోయిన తర్వాత విజయసాయిరెడ్డి విషయంలో జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అప్పట్లో వైరల్ అయ్యాయి. సాయి అన్నకు వయసు అయిపోయింది అంటూ తేల్చి చెప్పి ఆస్థానంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని తెచ్చి పెట్టారు. అయితే చెవిరెడ్డి సైతం జగన్మోహన్ రెడ్డితో ఉన్న సాన్నిహిత్యంతో వందల కోట్లు వెనుకేసుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. మద్యం కుంభకోణం దర్యాప్తు తర్వాత చెవిరెడ్డి సంపాదన బయటకు రావడంతో జగన్మోహన్ రెడ్డి సైతం ఆశ్చర్యపోయారట. అందుకే ఇటీవల చెవిరెడ్డి విషయంలో కూడా జగన్మోహన్ రెడ్డి అనుమానిస్తున్నారట. అనవసరంగా చెవిరెడ్డిని తీసుకొచ్చి విజయసాయిరెడ్డిని వదులుకున్నానని బాధపడుతున్నారట జగన్మోహన్ రెడ్డి.జగన్ కోటరీలో ఎలానూ పిఏ నాగేశ్వర్ రెడ్డి ఉంటారు. అయితే ఆయన సంపాదన ఇప్పుడు బయటపడడంతో జగన్మోహన్ రెడ్డి నోట మాట రావడం లేదు. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫండ్స్, ప్రభుత్వ కాంట్రాక్టులు,



బదిలీల వ్యవహారాల్లో అసలు కంటే ఆయన తిన్న కొసరు వందల కోట్లు ఎక్కువగా ఉందని ఆధారాలతో సహా తేలడంతో తాడేపల్లి ప్యాలెస్ వర్గాలు ఆశ్చర్యపడుతూ చూస్తున్నాయి. జగన్మోహన్ రెడ్డిని అడ్డం పెట్టుకుని ఆయనకు తెలియకుండానే ఈ కోటరీ నేతలు సమాంతర సామ్రాజ్యాలను నడిపించారని స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఇది సహజంగానే సజ్జల రామకృష్ణారెడ్డి శిబిరానికి ఉత్సాహం ఇచ్చే విషయం. ఎందుకంటే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పోటీగా వచ్చారు. ఇప్పుడు అదే చెవిరెడ్డి పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు జగన్ మోహన్ రెడ్డి. ఇదంతా మద్యం కుంభకోణం ద్వారానే జరగడంతో ఖుషి గా ఉంది సజ్జల వర్గం. అయితే మొత్తం సజ్జల సేఫ్ గా ఉంటే.. తనకు తెలియకుండానే ఇంత దోపిడీ రాజ్యం నడిసిందా? అని ఆశ్చర్యపోతున్నారట జగన్మోహన్ రెడ్డి. మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో తెలియాలి.

# తమిళనాడులో మహిళలకు రక్షణగా శివంగులు

చెన్నై, జూన్ 10,

తమిళనాడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన నెల రోజులకు విజయ్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. మహిళల రక్షణ కోసం సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో కానిస్టేబుల్ మొదలు ఐజీ స్థాయి అధికారి వరకు అందరూ మహిళా పోలీసులే ఉంటారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ సర్కారు మహిళల కోసం ప్రత్యేకంగా దిశ పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసిన తరహాలోనే.. దానికి మరింత అప్డేట్‌గా ఈ టాస్క్‌ఫోర్స్ పని చేస్తుందని భావిస్తున్నారు.తమిళనాడులో శాంతి భద్రతలపై తీవ్ర చర్చ జరుగుతున్న వేళ.. మహిళలకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా సీఎం విజయ్ కీలక ముందడుగు వేశారు. సెంగప్పెన్ స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను మంగళవారం ఆయన ప్రారంభించారు. తమిళనాడు సీఎంగా ప్రమాణం చేసిన సరిగ్గా నెల రోజులకు విజయ్ ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించడం విశేషం. స్త్రీలు, బాలికల భద్రత కోసం ఈ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ విభాగం పని చేస్తుంది. సింగప్పెన్ అంటే తమిళంలో సింహం లాంటి అమ్మాయి అని అర్థం. ఈ టాస్క్‌ఫోర్స్ విభాగంలో కానిస్టేబుల్ నుంచి ఐజీ స్థాయి వరకు అందరూ మహిళా పోలీసులే ఉంటారు. ఈ విభాగంలో పని చేసే వారికి మార్షల్ ఆర్ట్స్‌తోపాటు ఆయుధాల వినియోగం, బైక్ నడపడంపై శిక్షణ ఇస్తారుమహిళలపై వేధింపులు జరిగే కాలేజీలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు లాంటి రద్దీ ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించడం ద్వారా నేరాలు జరగకుండా ఈ టాస్క్‌ఫోర్స్ చూస్తుంది. ప్రత్యేకమైన యూనిఫామ్‌లో సింగప్పెన్ మహిళా పోలీసులు బైకులపై రోడ్ల మీద తిరుగుతుంటారు. దీని వల్ల ఆకతాయిలు భయపడతారు. మహిళలు స్వేచ్ఛగా సంచరించడానికి అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో వీరు మఫ్టీలో సాధారణ మహిళల్లా తిరుగుతూ ఆకతాయిల ఆట కట్టిస్తారు. ఈ టాస్క్‌ఫోర్స్‌లో పని చేసే వారికి బాడీ కెమెరాలు, జీపీఎస్ ట్రాకింగ్ వాహనాలను అందిస్తారు. మహిళా హెల్ప్ లైన్ నంబర్లు లేదా అత్యవసర కాల్ నంబర్‌కు వచ్చే కాల్స్‌ను ఈ టాస్కోఫోర్స్ కంట్రోల్ రూమ్ నిరంతరం పర్యవేక్షిస్తుంది.సింగప్పెన్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించిన సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. 'ఈ టాస్క్‌ఫోర్స్ నా హృదయానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. తమిళనాడులోని ప్రతి కుటుంబాన్ని రక్షించాలనే ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుంది. మహిళల రక్షణకు, మన కుటుంబాల భద్రతకు కట్టుబడి ఉన్నాం.

ఇది కేవలం ఎన్నికల హామీ కాదు.. అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ప్రారంభించడం ద్వారా కీలక ముందడుగు వేశాం. డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ అనే మూడు అంశాలపై మా ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. తమిళనాడును పూర్తిగా డ్రగ్స్ రహితంగా మార్చాలి. గతాన్ని తవ్వుకుంటూ కూర్చోవాలని మేం అనుకోవడం లేదు. సురక్షిత భవిష్యత్తును అందించడంపైనే మా ఫోకస్ ఉంది. మహిళలపై నేరాలను ఏమాత్రం సహించబోం. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తాం. ఆ శిక్షలు చూశాక, నేరాలు చేయాలంటే ఇతరులు భయపడేలా చేస్తాం' అని విజయ్ వ్యాఖ్యానించారు.హైదరాబాద్ శివార్లలో 'దిశ' ఘటన జరిగిన తర్వాత ఏపీలో ఆ సమయంలో అధికారంలో ఉన్న జగన్ సర్కారు మహిళల రక్షణ కోసం దిశ చట్టం తీసుకొచ్చి.. రాష్ట్రవ్యాప్తంగా దిశ పేరిట మహిళా పోలీసు స్టేషన్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దిశ యాప్‌ను సైతం నాటి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ యాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే లేదా ఫోన్‌ను గట్టిగా ఊపితే బాధితురాలి లైవ్ లొకేషన్ సమీపంలోని దిశ పోలీసు స్టేషన్‌కు, కంట్రోల్ రూమ్‌కు చేరేలా రూపకల్పన చేశారు. తమిళనాడులోని విజయ్ సర్కారు తీసుకొచ్చిన సింగప్పెన్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కూడా ఇదే తరహాలో ఉంటుంది. మహిళలపై నేరాలు జరగకుండా చూసే విషయంలో దిశతో పోలిస్తే ఈ టాస్క్‌ఫోర్స్‌ను కొంత మెరుగుపర్చారు.

# కాళ్ల బేరానికి టర్కీ...

న్యూఢిల్లీ, జూన్ 10,

టర్కీ మొన్నటి దాకా పాకిస్తాన్ కు వంత పాడింది. అంతటి భూకంపం లో కూడా భారత్ సహాయం చేస్తే ఆ విషయాన్ని కూడా మర్చిపోయి.. జమ్ము కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్ ను విపరీతంగా సపోర్ట్ చేసింది. అంతర్జాతీయ వేదికలలో పాకిస్థాన్ దేశాన్ని వెనకేసుకొచ్చింది. మన దేశం మీద లేనిపోని విమర్శలు చేసింది. వీటన్నిటినీ కూడా భారత్ నిశ్శబ్దంగా చూస్తూ ఉండిపోయింది. టర్కీ మాదిరిగా అరవలేదు.. అంతర్జాతీయ వేదికల మీద మాట్లాడలేదు.భారత్ మీద ఇష్టానుసారంగా మాట్లాడి.. పాకిస్తాన్ దేశానికి వంత పాడిన టర్కీకి ఇప్పుడు అసలు విషయం అర్థమవుతోంది. మధ్య ఆసియాలో యుద్ధాలు.. ఆర్థికంగా ఒత్తిడి.. పర్యాటక రంగంపై తీవ్రమైన ప్రభావం.. ఇవన్నీ కూడా టర్కీ దేశాన్ని తీవ్రమైన ఆలోచనలో పడేశాయి. ఇన్నాళ్లపాటు భారతదేశంతో విరోధం కొనసాగించిన టర్కీ ఇప్పుడు ఆకస్మాత్తుగా స్నేహం గుర్తుకొచ్చింది. అందువల్లే భారతదేశంతో మిత్రమా రా.. నాతో చేతులు కలుపు అన్నట్టుగా సంకేతాలు ఇస్తుంది. అయితే దీనిని భారత్ సరిగా పట్టించుకోవడం లేదు. టర్కీ బుద్ధి వచ్చేలా చేసేందుకు భారతదేశం గట్టిగా అరవలేదు.. ప్రపంచ వేదికల ముందు పిచ్చిపిచ్చిగా మాట్లాడలేదు. కేవలం లెక్కలు మాత్రమే వేసింది. ఆ లెక్కలు టర్కీ మొత్తాన్ని కదిలించాయి. లేని భూకంపాన్ని తెప్పించాయి. దీంతో టర్కీ కి ఇండియా అంటే ఏంటి.. నరేంద్ర మోడీ అంటే ఏంటో తెలిసింది. అందువల్లే కాళ్ళ బేరానికి వచ్చింది.చైనాలో యుగర్ ముస్లింల మీద దాడి చేస్తుంటే టర్కీ మాట్లాడలేదు. ఇరాన్, యెమన్, ఇరాక్ దేశాలలో ముస్లింలు చనిపోతుంటే టర్కీ మాట్లాడలేదు. కానీ కాశ్మీర్ విషయంలో మాత్రం గొంతు సవరించుకుంది. భారతదేశం మీద విష ప్రచారం చేసింది. భారత్ సైలెంట్ గా ఆర్మీనియా వైపు నడిచింది. సైప్రస్ మీద దృష్టి సారించింది. అంతేకాదు అత్యంత ఆధునికమైన ఆయుధాలను ఈ రెండు దేశాలకు ఇచ్చేందుకు సిద్ధమైంది. దీంతో భారత్ తనకు తెలియకుండానే తనకింద మంట పెడుతుందని టర్కీ కి అర్థమైంది. అందువల్లే ఇన్నాళ్లపాటు సాగించిన విరోధాన్ని.. శత్రుత్వాన్ని మర్చిపోయింది. స్నేహ హస్తాన్ని చాచింది.టర్కీని భారత్ నమ్మదు. అంతటి భూకంపం వచ్చినప్పుడు ప్రపంచ దేశాలు నిశ్శబ్దంగా ఉన్నప్పుడు భారత్ మాత్రమే టర్కీలో సహాయం చేసింది. మందుల నుంచి మొదలుపెడితే ఆహారం వరకు సరఫరా చేసింది. ఇవన్నీ మర్చిపోయి టర్కీ పాకిస్తాన్ దేశానికి జై కొట్టింది. దీనిని మనసులో పెట్టుకున్న భారత్ ఆర్మీనియా, గ్రీస్, సైప్రస్ దేశాలతో మాట్లాడింది. డిఫెన్స్ సహకారం పెంచింది.. ఫలితంగా టర్కీకి దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది.ఆకాష్ యాంటీ మిస్సైల్ సిస్టమ్స్.. ఫినాక రాకెట్ లాంచర్స్.. స్వాతి రాడార్లు.. బ్రహ్మోస్.. ప్రళయ్ మిస్సైల్స్.. ఇవన్నీ కూడా ఇచ్చేస్తోంది. దీంతో టర్కీ అన్ని మూసుకుంది. నాతో కలువు అంటూ భారతదేశానికి సంకేతాలు పంపిస్తోంది. టర్కీ మాటలు భారత్ వింటుందా నెవర్.. ఎందుకంటే ఆ దేశం పాము లాంటిది.. పాలు పోసినా సరే విషమే చిమ్ముతుంది.

# టాప్ సెలబ్రిటీ లిస్ట్ లో విరాట్

ముంబై, జూన్ 10దేశంలో ఎంతో మంది సెలబ్రిటీలు ఉన్నారు. క్రీడలు, సినిమాలు, వ్యాపారం, వ్యవసాయం, కళలు ఇలా అనేక రంగాల నుంచి అనేక మంది ప్రముఖ స్థానాల్లో ఉన్నారు. అయితే దేశంలో విలువైన సెలబ్రిటీ ఎవరు అన్నది వారి ఆదాయం ఆధారంగా ఉంటుంది. దీనిని గుర్తించేందుకు ఫార్చ్యూన్ ఇండియా ఇంటర్‌బ్రాండ్‌తో కలిసి తొలిసారిగా చేపట్టిన 'ఇండియా'స్ మోస్ట్ వాల్యూబుల్ సెలబ్రిటీస్' స్టడీలో విరాట్ కోహ్లీ అగ్రస్థానం సాధించారు. అతని బ్రాండ్ వాల్యూ రూ.3,542 కోట్లుగా నిర్ధారణ అయింది. ఇది ఎంతగా అనుసరిస్తారు, ఏ స్టార్ బ్రాండ్లకు నిజమైన విలువనిస్తారు అనేది స్పష్టంగా చెప్పే ఒక మైలురాయి.

కోహ్లీ టాప్..క్రికెటర్ విరాట్ కోహ్లీ సాధించిన ఈ స్థానం ఆయన క్రికెట్ ప్రదర్శన మాత్రమే కాదు. అతని ఫిట్‌నెస్ జీవనశైలి, స్థిరత్వం, గ్లోబల్ అప్పీల్, సోషల్ మీడియా ప్రభావం (270 మిలియన్ ఫాలోవర్లు), ప్రీమియం బ్రాండ్లతో దీర్ఘకాలిక సంబంధాలు ఇవన్నీ కలిసి అతన్ని భారతదేశ అత్యంత శక్తివంతమైన బ్రాండ్‌గా నిలిపాయి. ఇంటర్‌బ్రాండ్ పద్ధతిలో బ్రాండ్ వాల్యూను నిర్ణయించేటప్పుడు కేవలం పాపులారిటీ లేదా ఆదాయం మాత్రమే కాకుండా డిస్టినెక్టివ్‌నెస్, రిలవెన్స్, ఎంగేజ్‌మెంట్, ట్రస్ట్, రెస్పాన్సిబిలిటీ వంటి అంశాలను కూడా పరిగణించారు. ఈ అన్ని పారామీటర్లలోనూ కోహ్లీ టాప్‌లో నిలిచారు.

1. విరాట్ కోహ్లీ2. షారుఖ్ ఖాన్3. ప్రియాంక చోప్రా జోనాస్4. మహేంద్ర సింగ్ ధోనీ

5. రణవీర్ సింగ్6. అక్షయ్ కుమార్

7. అమితాబ్ బచ్చన్8. సచిన్ తెండుల్కర్9. ఆలియా భట్10. అల్లు అర్జున్11. దీపికా పదుకొణె17. రష్మిక మందన్న

టాప్‌లో క్రికెటర్లు? టాప్?10లో మూడు స్థానాలు (కోహ్లీ, ధోనీ, సచిన్) క్రికెటర్లది కావడం భారతదేశంలో క్రికెట్‌పై ఉన్న అపారమైన ఆధారణ, సామాజిక?ఆర్థిక ప్రభావాన్ని మరోసారి నిరూపిస్తోంది. బాలీవుడ్ సూపర్‌స్టార్ల కంటే క్రికెట్ ఐకాన్లు బ్రాండ్‌గా ఎక్కువ విలువనిస్తున్నారు.

బలంగా బాలీవుడ్ బాలీవుడ్ ఇంకా బలంగానే ఉంది, కానీ సవాళ్లు ఎదుర్కొంటోంది. షారుఖ్, ప్రియాంక, రణవీర్, అక్షయ్, అమితాబ్, ఆలియా వంటి స్టార్లు టాప్?10లో స్థానం సంపాదించడం బాలీవుడ్ ఇప్పటికీ బలమైన బ్రాండ్ శక్తిని కలిగి ఉందని చెబుతోంది. ముఖ్యంగా ప్రియాంక గ్లోబల్ ఇమేజ్ ఆమెను మూడో స్థానానికి చేర్చింది.

అల్లు అర్జున్ 10వ స్థానం, రష్మిక మందన్న 17వ స్థానం సాధించడం దక్షిణ భారత సినిమా (ముఖ్యంగా తెలుగు?కన్నడ) జాతీయ స్థాయి ప్రభావాన్ని సూచిస్తోంది. ఇది భారతదేశ ఎంటర్‌టైన్‌మెంట్ ల్యాండ్‌స్కేప్ మారుతోందని తెలియజేస్తుంది.ఫార్చ్యూన్?ఇంటర్‌బ్రాండ్ స్టడీ భారతదేశంలో సెలబ్రిటీ బ్రాండ్ వాల్యూ ఎలా కొలవాలో ఒక ప్రమాణాన్ని నిర్దేశించింది. విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానం సాధించడం ద్వారా ఒక విషయం స్పష్టమవుతోంది. ఇక్కడ నిజమైన బ్రాండ్ వాల్యూ కేవలం పాపులారిటీ లేదా ఫాలోవర్ల సంఖ్యపై మాత్రమే ఆధారపడదు. అది స్థిరత్వం, విశ్వసనీయత, సామాజిక ప్రభావం, ఆధునిక భారతీయ యువత ఆశించే విలువలపై ఆధారపడి ఉంటుంది.

# టార్గెట్ బీఆర్ఎస్

హైదరాబాద్, జూన్ 10,

తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల ఒక స్పష్టమైన మార్పు గమనించవచ్చు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన రాజకీయ విమర్శల పంథాను పూర్తిగా మార్చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీకి ప్రధాన శత్రువుగా ఉన్న బీఆర్ఎస్, దాని అధినేత కేసీఆర్‌లను టార్గెట్ గా చేసుకుని ఆయన విరుచుకుపడేవారు. కానీ ఇప్పుడాయన రూట్ మార్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. ఎక్కడ బహిరంగ సభ జరిగినా కిషన్ రెడ్డి లక్ష్యంగా ఆయన ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. "ఈ నెల 15వ తేదీ తర్వాత కిషన్ రెడ్డి సంగతి చూస్తాం" అంటూ సీఎం రేవంత్ రెడ్డి విసిరిన తాజా సవాల్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.అసలు రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను కాదని, కిషన్ రెడ్డిని ఎందుకు టార్గెట్ చేసుకుంటున్నారనేదానిపై ఆరా తీస్తే.. దీని వెనుక అనేక వ్యూహాలు దాగి ఉన్నట్టు అర్థమవుతోంది. తెలంగాణలో ప్రాంతీయ పార్టీగా ఉన్న బీఆర్ఎస్‌ను పూర్తిగా నిస్తేజం చేసి మూడో స్థానానికి పరిమితం చేయడమే కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. రాష్ట్రంలో ప్రధాన పోటీ కేవలం జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్యే ఉందనే వాతావరణాన్ని కల్పించడం ద్వారా, రాబోయే ఎన్నికల నాటికి ద్విముఖ పోరు జరిగేలా రేవంత్ రెడ్డి పావులు కదుపుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడం, ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోవడంతో బీఆర్ఎస్ క్యాడర్, ఓటు బ్యాంక్ బలహీనపడింది. ఈ తరుణంలో బీఆర్ఎస్‌ను ఇంకా టార్గెట్ చేయడం వల్ల ఆ పార్టీకి అనవసర మైలేజ్ ఇచ్చినట్లవుతుందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే బీజేపీని ప్రధాన ప్రత్యర్థిగా నిలబెడుతున్నారు.క్షేత్రస్థాయిలో బలపడుతున్నట్లు కనిపిస్తున్న బీజేపీని ప్రధాన శత్రువుగా చూపించడం వెనుక పెద్ద ఓటు బ్యాంక్ వ్యూహం ఉంది. రాష్ట్రంలో బీజేపీని వీలైనంతగా టార్గెట్ చేయడం ద్వారా యాంటీ బీజేపీ ఓట్లన్నీ ముఖ్యంగా మైనారిటీలు, దళితులు, వెనుకబడిన వర్గాల ఓట్లు చీలిపోకుండా ఏకపక్షంగా కాంగ్రెస్ వైపు ఏకీకృతం అవుతాయని రేవంత్ రెడ్డి అంచనా వేస్తున్నారు. మైనారిటీ ఓటర్లలో బీఆర్ఎస్‌పై నమ్మకం తగ్గితే, ఆ ఓట్లు కాంగ్రెస్‌కే పడాలంటే బీజేపీని పెద్ద శత్రువుగా చూపించడం రేవంత్‌కు అత్యంత అవసరం.కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేయడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణ సెంటిమెంట్‌ను మళ్లీ తెరపైకి తెస్తున్నారు. మోదీ గుజరాత్‌లో సబర్మతి నదిని అభివృద్ధి చేసుకుంటే ఆహా ఓహో అనే కిషన్ రెడ్డి, తాము మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించడం వెనుక ప్రాంతీయ సెంటిమెంట్‌ను రచ్చకెక్కించే వ్యూహం ఉంది. చేవెళ్ల, మెదక్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ ఎంపీలుగా బీజేపీ నేతలే ఉన్నా.. కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు తేవడంలో వారు విఫలమయ్యారని ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా, బీజేపీని బలహీనపరచాలని రేవంత్ చూస్తున్నారు.దీనికి కౌంటర్‌గా బీజేపీ సైతం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నేరుగా ఢీకొట్టడానికే మొగ్గు చూపుతోంది. రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలను, కేంద్ర పెద్దలతో ఆయన జరిపే భేటీలను కిషన్ రెడ్డి క్షుణ్ణంగా గమనిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. తాము కూడా బీఆర్ఎస్‌ను పక్కన పెట్టి, కేవలం కాంగ్రెస్ వైఫల్యాలనే ఎండగట్టడం ద్వారా తెలంగాణలో తామే ప్రత్యామ్నాయ శక్తి అని నిరూపించుకోవాలని బీజేపీ భావిస్తోంది. అంటే, ఉభయ పక్షాలు పరస్పరం లబ్ధి పొందేలా, బీఆర్ఎస్ ఉనికిని క్రమంగా తుడిచిపెట్టేలా ఈ ద్విముఖ పోరు వ్యూహానికి ఇరు పార్టీలూ సహకరించుకుంటున్నాయనే భావన వ్యక్తమవుతోంది.సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న ఈ సరికొత్త రాజకీయ వ్యూహం తెలంగాణను భవిష్యత్తులో కేవలం రెండు జాతీయ పార్టీల రణరంగంగా మార్చబోతోంది. రాబోయే 24 నెలల కాలం అభివృద్ధిపైనే దృష్టి పెడతామని చెబుతూనే, రాజకీయంగా ప్రత్యర్థులను కోలుకోకుండా చేయడం రేవంత్ మార్క్ పాలిటిక్స్ కు నిదర్శనం.

# కిషన్ వర్సెస్ రేవంత్

హైదరాబాద్, జూన్ 10,

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కాలంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని టార్గెట్ చేశారు. బీజేపీపై పదే పదే విమర్శలు చేస్తున్నారు. గత రెండేళ్లలో బీజేపీపై ఇలాంటి, ఈ స్థాయిలో రేవంత్ రెడ్డి విమర్శలు చేయలేదు. కానీ గత కొన్ని రోజుల నుంచి బీజేపీ కేంద్ర నాయకత్వం, మోదీ, కిషన్ రెడ్డిలతో సహా అందరిపైనా విమర్శలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేస్తుందన్నది రేవంత్ రెడ్డి ఆరోపణ. అయితే బీజేపీ నేతలు మాత్రం పాలన చేతకాక కేంద్ర ప్రభుత్వం పై రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తున్నారంటున్నారు. గత కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే రేవంత్ రెడ్డి తనకు ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ కాదని, బీజేపీ మాత్రమేనని ఫిక్సయినట్లు తెలిసింది.తెలంగాణలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని అన్నదాతలు ఆందోళనకు దిగుతున్నారు. అయితే ఇందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించడం లేదని రేవంత్ రెడ్డి చెబుతున్నారు. మరో వారం రోజుల్లో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తమ ప్రభుత్వం సేకరిస్తుందని, దానిని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. అందుకు కిషన్ రెడ్డి కూడా కేంద్రంతో సహకరించాలని కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రానికి రావాల్సిన అనుమతులను కిషన్ రెడ్డి కావాలని అడ్డుకుంటున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. మెట్రో రైలు విస్తరణ, మూసీ సుందరీకరణ పనులకు కేంద్రం సహకరించకపోవడానికి కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం పెద్దలతో మాట్లాడినందునేనని రేవంత్ ఆరోపిస్తున్నారు.అలాగే తుమ్మిడి హట్టి ప్రాజెక్టుకు సంబంధించి అవసరమైన స్థలం కోసం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తో చర్చించాలనుకున్నప్పటికీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాత్రం అందుకు సహకరించడం లేదని చెబుతున్నారు. ఇలా దాదాపు అన్ని అంశాల్లోనూ కేంద్ర ప్రభుత్వంతో పాటు కిషన్ రెడ్డిని కూడా రేవంత్ రెడ్డి టార్గెట్ చేయడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల కోసమే ఈ విమర్శలు చేస్తున్నారని బీజేపీ ఆరోపిస్తుంది. బీజేపీ తెలంగాణలో పుంజుకుంటుందని భావించి రేవంత్ రెడ్డి డైవర్షన్ డ్రామాలకు తెరలేపుతున్నారంటూ బీజేపీ చీఫ్ రామచంద్రరావు లాంటి నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తం మీద తెలంగాణ రాజకీయాల్లో రేవంత్ వర్సెస్ కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం వాడి వేడిగా జరుగుతుంది.

# అమ్మకాలలో విస్కదే టాప్

హైదరాబాద్, జూన్ 10,

తెలంగాణ మద్యం విక్రయాల్లో అత్యధిక వాటా విస్కీదేనని గణాంకాలు చెబుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే.. తెలంగాణలో మద్యం ప్రియులు.. విస్కీకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఇక త్వరలోనే తెలంగాణలో మద్యం ధరలు పెంచేందుకు సర్కార్ ప్రయత్నాలు చేస్తుండటంతో.. విస్కీ లవర్స్‌కు షాక్ తప్పదనే వాదనలు వినిపిస్తున్నాయి. మద్యం ధరల పెంపు ప్రతిపాదనలతో మందుబాబుల్లో తెలియని ఆందోళన నెలకొంది.తెలంగాణలోని ఏ వైన్స్, ఏ బార్‌లోకి వెళ్లినా విస్కీ అమ్మకాలే ఎక్కువగా ఉంటాయి. (

పస్తుతం వేసవి కాలం సందర్భంగా ఎండవేడిమిని తట్టుకునేందుకు మద్యం ప్రియులు.. చల్లని బీర్లు తాగుతున్నా.. విస్కీ అమ్మకాలే అత్యధికంగా ఉంటాయని లెక్కలు చెబుతున్నాయి. తెలంగాణ మద్యం మార్కెట్‌లో విస్కీదే సింహభాగం ఉంటుంది. తక్కువ ధర బ్రాండ్ల మద్యం దగ్గరి నుంచి ఖరీదైన బ్రాండ్ల వరకు మందుబాబులు విస్కీకే ఓటేస్తున్నారు. మరీ ముఖ్యంగా దక్షిణ భారతదేశ రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో విస్కీ వినియోగం అత్యధికంగా ఉంది. ఇదే సమయంలో.. తొందర్లోనే రాష్ట్రంలో మద్యం ధరలు పెంచేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్న నేపథ్యంలో విస్కీ ప్రియుల జేబుకు చిల్లు తప్పదనే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.2026లో మద్యం మార్కెట్ గణాంకాల ప్రకారం.. తెలంగాణలో అమ్ముడు అవుతున్న ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ వాటా ఏకంగా 84.89 శాతం ఉన్నట్లు వెల్లడైంది. దీంతో దేశంలోనే అత్యంత ఎక్కువ విస్కీ విక్రయించే రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచింది. ఇది కర్ణాటకలో 76.50 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 55 శాతం మాత్రమే ఉంది. మరోవైపు.. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికీ బ్రాండీ వినియోగమే ఎక్కువగా ఉండటం గమనార్హం. హైదరాబాద్‌లోని ఐటీ, సర్వీస్ సెక్టార్ ఉద్యోగుల్లో పెరుగుతున్న డిమాండ్ కారణంగా బ్రీజర్ల వాటా 3.32 శాతంగా నమోదైనట్లు గణాంకాలు పేర్కొంటున్నాయి.తెలంగాణలో విస్కీ అంటే కేవలం మద్యం మాత్రమే కాదని.. సామాజిక జీవనంలో ఒక భాగమైపోయిన అలవాటు అని హైదరాబాద్‌కు చెందిన లిక్కర్ మార్కెట్ విశ్లేషకుడు ఒకరు చెప్పారు. అందుకే మద్యం ధరలు పెరిగితే.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోని కుటుంబాలు, రిటైల్ వ్యాపారులు, హాస్పిటాలిటీ రంగంపై ప్రభావం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.తెలంగాణలో మీడియం, ప్రీమియం విస్కీ బ్రాండ్లకు క్రమంగా డిమాండ్ పెరుగుతోంది. మొత్తం విస్కీ అమ్మకాల్లో 45.9 శాతం క్వార్టర్ రూ.170 నుంచి రూ.260 మధ్య ధర కలిగిన బాటిళ్లే ఉండటం గమనార్హం. ఇక రూ.110 ధర కలిగిన క్వార్టర్ల వాటా 22.69 శాతం ఉండగా.. రూ.140-160 ధరల విస్కీలు 21.07 శాతం అమ్మకాలు అయినట్లు లెక్కలు చెబుతున్నాయి. అదే సమయంలో రూ.270-రూ.350 ధరల ప్రీమియం విస్కీల వాటా 6.54 శాతం కాగా.. రూ.350 కంటే ఎక్కువ ధర కలిగిన ప్రీమియం బ్రాండ్ల వాటా 3.8 శాతంగా ఉంది. తెలంగాణలో అమ్ముడయ్యే ప్రతీ 10 ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ బాటిళ్లలో దాదాపు 9 బాటిళు విస్కీయే కావడం విశేషం.ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్‌లో విస్కీ తర్వాత బ్రాండీ నిలిచింది. బ్రాండీ వాటా కేవలం 9.21 శాతం మాత్రమే ఉంది. ఆ తర్వాత వోడ్కా 1.24 శాతం, వైన్ 0.88 శాతం, రమ్ 0.32 శాతం, జిన్ 0.09 శాతం, లిక్యూర్ 0.04 శాతం, టెకిలా కేవలం 0.01 శాతం మాత్రమే వాటాను కలిగి ఉన్నాయి. ఒకప్పుడు దక్షిణ భారత రాష్ట్రాల్లో బ్రాండీకి భారీగా డిమాండ్ ఉండేది.

అయితే తెలంగాణలో ప్రస్తుతం అది భారీగా తగ్గిపోయింది. బ్రాండీ విభాగంలో కూడా రూ.150 నుంచి రూ.200 మధ్య ధరల ఉత్పత్తులే 63.99 శాతం అమ్మకాలను సాధిస్తున్నాయి.మరోవైపు.. తెలంగాణలో బీర్ అమ్మకాల్లో కూడా కీలక మార్పులు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకు స్ట్రాంగ్ బీర్‌కు ఎక్కువ ఆదరణ ఉండగా.. ప్రస్తుతం లైట్ బీర్ వైపు మందుబాబులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. మొత్తం బీర్ అమ్మకాలలో లైట్ బీర్లు 55.97 శాతం ఉండగా.. 44.03 శాతం స్ట్రాంగ్ బీర్ల వాటా నమోదైంది. మార్కెట్ వర్గాల ప్రకారం.. తక్కువ ఆల్కహాల్ ఉన్న పానీయాల వైపు యువత మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది.

# సంక్షేమ హాస్టల్స్ డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ రుసుములు పెంపు

హైదరాబాద్, జూన్ 10,

దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల విద్యా సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చర్యలు చేపడుతోందని డిప్యూటీ సీఎం భట్టి వ్యాఖ్యానించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లో రూ.110 కోట్లతో పది అంతస్తుల అంబేద్కర్ నాలెడ్జ్ టవర్‌ను నిర్మించనున్నట్లు చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు భోజన రుసుములను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచుతూ ప్రతి నెలా నిధులు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.తెలంగాణ రాష్ట్రంలోని దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులను ప్రపంచస్థాయి పోటీకి సన్నద్ధం చేసేలా విద్యా సాధికారత కోసం ప్రభుత్వం చరిత్రాత్మక చర్యలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హైదరాబాద్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో రూ.110 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ప్రతిష్టాత్మక అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ అనేది కేవలం ఇటుకలు, సిమెంట్‌తో కట్టే సాధారణ భవనం కాదని, కోట్ల మంది దళిత, గిరిజన, వెనుకబడినవర్గాల యువత భవిష్యత్తును సరికొత్తగా తీర్చిదిద్దే ఒక విజ్ఞాన క్షేత్రమని అభివర్ణించారు. అధునాతన హంగులతో సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల భారీ నిర్మాణంగా ఈ టవర్‌ను రూపుదిద్దనున్నట్లు వెల్లడించారు. ఈ భవనంలో అంతర్జాతీయ స్థాయి డిజిటల్ లైబ్రరీలు, అత్యాధునిక ఈ-లెర్నింగ్ సెంటర్లు, ఉన్నత విద్యా పరిశోధన విభాగాలు, సివిల్స్, ఇతర పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కేంద్రాలు, అంతర్జాతీయ సెమినార్ల కోసం కాన్ఫరెన్స్ హాళ్లు, నిపుణులతో కెరీర్ గైడెన్స్ యూనిట్లను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. పేద విద్యార్థులు ఖరీదైన కోచింగ్‌ల కోసం హైదరాబాద్‌కు వచ్చి ఇబ్బంది పడకుండా తమ సొంత జిల్లాల పరిధిలోనే శిక్షణ పొందేలా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల ఇబ్బందులను తొలగించేందుకు ఇక నుంచి ప్రతి నెలా డైట్, కాస్మెటిక్ రుసుములను బకాయిలు లేకుండా సకాలంలో విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి హామీ ఇచ్చారు. గత పదేళ్ల భారాస పాలనలో విద్యార్థుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశారని విమర్శించిన ఆయన.. ప్రస్తుత మార్కెట్ ధరలకు అనుగుణంగా తమ ప్రభుత్వం భోజన రుసుములను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను ఏకంగా 200 శాతం పెంచి ఇస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శిథిలావస్థకు చేరిన సంక్షేమ హాస్టళ్ల పునర్నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టామని ఇందులో భాగంగానే నింబోలిఅడ్డాలోని చారిత్రాత్మక ఎస్సీ హాస్టల్‌కు నూతన భవనాన్ని యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నట్లు తెలిపారు

## పెట్రోల్ ఎఫెక్ట్...
# పిల్లల పై ట్రాన్స్ పోర్టు చార్జీల భారం

హైదరాబాద్, జూన్ 10,

పశ్చిమాసియా యుద్ధ ప్రభావం స్కూల్ విద్యార్థులపైనా పడుతోంది. యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో.. కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 3 సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ నేపథ్యంలోనే పెట్రోల్, డీజిల్‌తో నడిచే ఆటోలు, ప్రైవేటు కార్లు కూడా ధరలు పెంచేస్తున్నాయి. ఇక త్వరలోనే స్కూళ్లు ప్రారంభం కానుండగా.. విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులను ఆయా వాహనదారులు పెంచేస్తున్నారు. దీంతో స్కూల్ పిల్లల తల్లిదండ్రులకు ఈ పెంపు కూడా అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు హైదరాబాద్‌లో స్కూల్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పెరిగినట్లు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు పెరగడంతో.. ఆటో డ్రైవర్లు, ప్రైవేటు కార్లు ఒక్కో విద్యార్థిపై రూ.1000 నుంచి రూ.1200 వరకు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలను పెంచినట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. ఇది తమకు అదనపు ఆర్థిక భారంగా మారుతోందని వాపోతున్నారు. గతేడాదితో పోలిస్తే రవాణా ఖర్చులు గణనీయంగా పెరిగినట్లు పేర్కొంటున్నారు. అయితే ఇంధన ధరలు పెరగడం వల్లే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వాహనదారులు తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. చమురు ధరలు ఒక్కసారిగా పెరగాయని.. తప్పనిసరి పరిస్థితుల్లో ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని చెబుతున్నారు.గతేడాది తమ ఇద్దరు పిల్లలకు కలిసి రూ.6 వేలు ట్రాన్స్‌పోర్టు ఛార్జీలు చెల్లించామని చెప్పిన ఓ మహిళ.. ఈ ఏడాది అది ఏకంగా రూ.7,500కి పెరిగినట్లు తెలిపారు. ఇక గత సంవత్సరం తమ ఒక్కగానొక్క పిల్లాడిని స్కూల్‌కు పంపించేందుకు ఆటోకు రూ.3,500 చెల్లించగా.. ఈ ఏడాది రూ.4,500కి పెంచారని మరో వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. చమురు ధరలు పెరగకముందు హైదరాబాద్‌లో లీటరు పెట్రోల్ ధర రూ. 107.39.. డీజిల్ రూ. 95.64గా ఉండేది. పెంచిన తర్వాత.. పెట్రోల్ రూ. 115.73, డీజిల్ రూ.103.82గా కొనసాగుతున్నాయి. దీంతో లీటర్ పెట్రోల్, డీజిల్‌పై దాదాపు రూ.8 పెరుగుదల కనిపించింది.నగర వ్యాప్తంగా తమ పిల్లలను మంచి స్కూల్‌లో చదివించాలని భావిస్తున్న తల్లిదండ్రులు.. తమ ఇంటికి దూరంగా ఉన్న స్కూళ్లకు పిల్లలను పంపించేందుకు ఆటోలు, ప్రైవేటు కార్లను ఆశ్రయిస్తున్నారు. ఉదయం ఇంటి నుంచి స్కూల్‌కు తీసుకెళ్లి.. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి తీసుకువచ్చేందుకు వాహనదారులు ట్రాన్స్‌పోర్టు ఫీజులు వసూలు చేస్తున్నారు. అయితే ఇలాంటి పరిస్థితి కేవలం హైదరాబాద్ నగరంలో మాత్రమే కాకుండా.. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లోనూ ఇలాగే ట్రాన్స్‌పోర్టు ఫీజులు పెంచేశారని సోషల్ మీడియాలో నెటిజన్లు పోస్టులు, కామెంట్లు పెడుతున్నారు.

==========

# ఆగని నీటి యుద్ధం

హైదరాబాద్, జూన్ 10

నీళ్లు, నిధులు, నియామకాలు.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ఊపిరిలూదిన ప్రాథమిక నినాదాం. కానీ, ఆ నినాదాలు నినాదాలుగానే మిగిలిపోతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పుష్కర కాలం (12 ఏళ్లు) గడిచినా ఉమ్మడి ప్రాజెక్టుల నీటి వినియోగంలో నదీ జలాల వాటాల పంపకంలో ఆంధ్రప్రదేశ్ ఇప్పటి కీ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉంది. కృష్ణా జలాల్లో ఇరు రాష్ట్రాలకు వాటాల కేటాయింపులో అప్పటి ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించకపోవడంతో నష్టపోయామని మేధావులు, ఇంజినీర్లు, తెలంగాణ వాదులు అంటున్నారుకనీసం నిర్ణయించిన వాటాను సైతం ఉపయోగించుకో కుండా.. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు వత్తాసు పలుకుతుండటాన్ని వారు ఎత్తిచూపుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి ఇంకా దిగజారిందని, పక్క రాష్ట్రానికి గేట్లు బార్లా తెరవ డంతో.. వాటాను మించి ఉపయోగించుకుంటుందని తెలంగాణ ఇంజినీర్లు చెబు తున్నారు. స్వరాష్ట్రంలోనూ జరుగుతున్న ఏపీ జల దోపిడీని పాలకులు చూసీ చూడనట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మొదట్లో ఇరు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో వినియోగించుకోవాలి. అయితే ఈ ఒప్పందమే సరికాదని అందరూ అం టుంటే.. అసలు చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారమైనా కృష్ణా జలాలను వినియోగించుకున్నారా అంటే.. అదీ లేదని అధికారిక గణాంకాలను చూస్తే అర్థం అవుతుంది. గడిచిన 12 ఏళ్లలో కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ వినియోగించిన మొత్తం శాతం 826.64 కాగా.. ప్రతి సంవత్సరం సగటున 68.88 శాతం (ఏపీకి 66 శాతం వాటా) తరలిస్తోంది. అంటే సగటున ప్రతి సంవత్సరం సుమారు 3 శాతం నీటిని అదనంగా వాడుకుంటున్నట్టుగా చెప్పవచ్చు. తెలంగా ణ విషయానికి వచ్చేసరికి.. 12 ఏళ్లలో 374.36 శాతం.. అంటే ఏటా సగటున 31.19 శాతం జలాలను మాత్రమే వాడుకున్నది.ఈ లెక్కన ప్రతి సంవత్సరం సగటున సుమారు 3 శాతం వరకు (తెలంగాణ వాటా 34 శాతం) కృష్ణా జలాలను తెలంగాణ నష్టపోయిందనే చెప్పవచ్చు. అంటే ఒక సంవత్సరంలో ఎంతమేర తెలంగాణ కృష్ణా నదీ జలాలను వాడుకోవాలో గడిచిన 12 ఏండ్ల లో అంతమేర నష్టపోయినట్టే. ఇది వందల టీఎంసీలలో ఉంటుంది. నిజానికి ప్రత్యేక తెలంగాణ వచ్చిందే.. నీళ్లు, నిధులు, నియామకాలలో దోపిడీ జరుతుందనే. అందుకే దశాబ్దాలుగా పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని తెచ్చుకున్నారు. కానీ,ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటికీ.. ఇంకా జల దోపిడీ కొనసాగుతూనే ఉందని మేధావులు, ఇంజనీర్లు, తెలంగాణీయులు భగ్గుమంటున్నారు. రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం (2014-15)లో తెలంగాణ తనకు కేటాయించిన వాటా (34 శాతం)లో కేవలం 30 శాతం మాత్రమే ఉపయోగించుకుంది.కానీ, ఏపీ తనకు కేటాయించిన (66 శాతం) వాటాను మించి 69.92 శాతం జలాలను వినయోగించుకుంది. 2015-17 వరకు ఒకటి.. అర శాతం వరకు తగ్గింది. 2023-24లో ఎన్నికల ప్రభావం కారణంగా 34 శాతానికి మించి చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ 36.34 శాతం జలాలను వియోగించుకోవడం ఇక రికార్డు. ఆ తరువాత కూడా కేటాయింపుల దరిదాపుల్లోకి కూడా తెలంగాణ రాలేదు. పుష్కర కాలంలో కేవలం ఒకే ఒకసారి వాటాను మించి కృష్ణా నదీ జలాలను తెలంగాణ ఉపయోగించుకుంది. ఇక మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపొంది.. పాలనా పగ్గాలు చేపట్టిన తరువాత.. పరిస్థితి మరింత దారుణంగా తయారయ్యింది. 2024-25లో 28.27 శాతం జలాలను మాత్రమే తెలంగాణ వినియోగించుకోగా.. ఏపీ మాత్రం 72.73 శాతం తరలించుకుపోయింది. ఇక ఎన్నడూ లేని విధంగా 2025-26లో ఇప్పటి వరకు కేవలం 25.10 శాతం మాత్రమే జలాలను తెలంగాణ వినయోగించుకుంటే.. పుష్కర కాలంలోనే అత్యధికంగా ఏపీ 74.90 శాతం జలాలను తరలించుకుపోవడం గమనార్హం. అంటే ఈ సంతవ్సరం వాటా (66శాతం) కంటే సుమారు 10 శాతం జలాలను అదనంగా తరలించుకుపోవడాన్ని తెలంగాణ మేధావులు, ఇంజనీర్లు, తెలంగాణీయులు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు.ఈ ఏడు ఎల్‌నినో ప్రభావం కారణంగా సాధారణ వర్షాలు సరిగ్గా కురవవని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

## మధ్యప్రదేశ్ బీజేపీ నాయకులకు సమాచారం ఇచ్చింది తెలంగాణ కాంగ్రెస్ నాయకులే బాంబ్ పేల్చిన మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రి

భోపాల్ జూన్ 10,

మినాక్షి నటరాజన్ మీద కేసు గురించి మాకు తెలంగాణ కాంగ్రెస్ నాయకుల నుండే రిపోర్ట్ వచ్చిందని ఆ రాష్ట్ర మంత్రి కైలాష్ వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉంది.. అంటే అర్థం చేసుకోండి. కాంగ్రెస్ పార్టీలో వాళ్ళే మాకు ఈ సమాచారం ఇచ్చారని అయనఅన్నారు.

## మైనర్ పై అత్యాచార కేసు రాయాలంటే రూ.10 వేలు లంచం డిమాండ్ చేసిన పోలీసులు

కలబుర్గి జూన్ 10,

చెత్త ఏరుకునే మహిళ కుమార్తె (మైనర్)పై అత్యాచారం జరిగింది. ఈ కేసులో చార్జీట్ వేయాలని, మీకు అనుకూలంగా రాయాలంటే రూ.10 వేలు లంచం ఇవ్వాలని స్టేషన్ అధికారిణి జ్యోతి, ఏఎస్సై శివశరణప్ప బాలిక తల్లిని డిమాండ్ చేశారు.కూతురిపై అఘాయిత్యం జరిగి బాధపడుతుంటే, కర్ణాటకలోని కలబురగిలోని స్టేషన్ బజార్ పోలీసులు డబ్బుల కోసం వేధించడంతో ఆమె వేదనకు గురైంది. దీంతో కొందరు సామాజిక కార్యకర్తల సాయంతో లోకాయుక్తను ఆశ్రయించింది. ఆమె నుంచి జ్యోతి లంచం తీసుకుంటుండగా లోకాయుక్త పోలీసులు దా..డి చేశారు. లంచం తీసుకుంటూ మహిళా కానిస్టేబుల్ జ్యోతి లోకాయుక్తకు చిక్కగా, ఏఎస్సై శివశరణప్ప పరారయ్యాడు

## ప్రధాని గా మోదీ రికార్డు పూజలు జరిపిన బీజేపీ నేతలు

హైదరాబాద్ జూన్ 10,

భారత ప్రజాస్వామ్య ప్రయాణంలో నేడు ఒక చారిత్రాత్మక మైలురాయి అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్ర రావు అన్నారు.ప్రధానమంత్రి నరేంద్రమోడీ భారతదేశంలో అత్యధిక కాలం సేవలందించిన ఎన్నికైన ప్రధానమంత్రిగా చరిత్ర సృష్టించడం ప్రతి భారతీయుడికి అపార గర్వకారణం.ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావు తార్నాకలో పరమశివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మోదీ గారికి దీర్ఘాయుష్షు, సంపూర్ణ ఆరోగ్యం, అలాగే మాతృభూమి సేవలో మరింత శక్తి కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 4,399 రోజుల ఈ సేవా ప్రయాణం కేవలం పదవీకాల రికార్డు మాత్రమే కాదు. శక్తివంతమైన, సమృద్ధిశాలి, అభివృద్ధి చెందిన, ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఇది ఒక స్వర్ణిమ అధ్యాయం.మోదీ నాయకత్వంలో దేశం సేవ, సుశాసన్, గరీబ్ కల్యాణ్, వికసిత్ భారత్ సంకల్పంతో ముందుకు సాగుతోంది. ఆయన ప్రజా జీవితంలోని ప్రతి రోజు మా భారతి సేవకు, 140 కోట్ల భారతీయుల సంక్షేమానికి అంకితమైంది తెలిపారు.

# నిబంధనలకు నీళ్లు

నల్గొండ, జూన్ 10,

ఏదైనా పరిశ్రమలకు అనుమతులు రావాలంటే ఖచ్చితంగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందే. అయితే కొన్ని పరిశ్రమలు అనుమతులు వచ్చిన తర్వాత ఆ నిబంధనలకు నీళ్ళొదులుతూ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కేవలం లాభాల కోసం నడుపుతుంటారు. సరిగ్గా ఇదే విధానం నేడు జిల్లాలోని మేళ్లచెరువులో మైహోమ్ (మహా) సిమెంట్ పరిశ్రమ యాజమాన్యం అవలంబిస్తున్నట్లు తెలుస్తుందిపర్యావరణ, మైనింగ్ నిబంధనల మేరకే తమ సంస్థ పనిచేస్తుందని చెప్పుకునే యాజమాన్యం అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. వాస్తవికంగా సున్నపురాయి మైనింగ్ కోసం ప్రభుత్వ భూమిని లీజుకు తీసుకొన్న మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ ఏకంగా మైనింగ్ లీజు భూమిలో ప్రైవేట్ రైల్వే లైన్ నిర్మించుకుందనేధి స్థానికులందరూ చర్చించుకుంటున్న మాట. ఇంతటితోనే ఆగకుండా మైనింగ్ లీజు భూమిని కబ్జా చేసి భారీ నిర్మాణాలకు పాల్పడుతున్నారనే అభియోగాలు ఉన్నాయి.అక్రమంగా క్రయ, విక్రయాలు జరుపుతున్నట్లు స్థానికుల ద్వారానే తెలుస్తుంది .చెట్టు పేరు చెప్పి కాయలు అమ్మిన చందంగా మైహోం సిమెంట్ సంస్థ పేరు చెప్పి కొందరు భూకబ్జాదారులు మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ లీజు భూమిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనీ కొందరు స్థానికుల ద్వారా తెలుస్తుంది. ప్రస్తుత టెక్నాలజీ ప్రకారం మైనింగ్ భూమిలో నిబంధనలకు మించి సెంటు భూమి కబ్జా చేసిన చర్యలు దిగుతున్న ప్రభుత్వాలు మైహోమ్ సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం ఏకంగా ప్రైవేట్ రైల్వే లైన్ నిర్మించినా అడ్డుకోకపోగా భూకబ్జాలను ప్రోత్సహిస్తున్నారంటూ అటు కేంద్ర, ఇటు రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.మేళ్లచెరువు మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 874లో 567 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలోనే 30ఎకరాల్లో తాసిల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్, ఎంపిడిఓ ఆఫీస్, జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ సహా ఎస్సీ కాలనీ ఇండ్లు ఉన్నాయి. ఇదే సర్వే నెంబర్ గల భూమిలో 141.644 హెక్టార్ల భూమిని సున్నపురాయి మైనింగ్ కోసం మైహోమ్ సిమెంట్ పరిశ్రమకు 1983లో ప్రభుత్వం లీజుకు ఇచ్చింది. అప్పటి దేవి సిమెంట్స్ పర్యావరణ అనుమతులు తీసుకొని కేంద్ర ప్రభుత్వ అనుమతుల మేరకు మైనింగ్ కార్యకలాపాలు మాత్రమే నిర్వహిస్తుంది. ఇటీవల 2023లో మైహోమ్ సిమెంట్స్ పర్యావరణ అనుమతులను రెన్యువల్ చేసుకుంది. షరతులతో కూడిన అనుమతులను పర్యావరణ శాఖ జారీ చేసింది.కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పు శాఖ జారీ చేసిన పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా మైహోం సిమెంట్స్ పరిశ్రమ మైనింగ్ భూమిలో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టిందనేధి అందరికి కనిపిస్తున్న విషయమే. మైనింగ్ లీజు అగ్రిమెంట్ ప్రకారం భూమిని మైనింగ్ కోసమే వినియోగించాలి. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులు విరుద్ధంగా ఎటువంటి నిర్మాణాలు, ఇతర కార్యకలాపాలు చేపట్టరాదు. ఒకవేళ ఏమైనా నిర్మాణాలు, ఇతర కార్యక్రమాలు చేపట్టినా ఖచ్చితంగా పర్యావరణ శాఖ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ మైహోమ్ సిమెంట్ పరిశ్రమ పర్యావరణ , మైనింగ్ శాఖ కల్లుగప్పి ఏకంగా ప్రైవేట్ రైల్వే ట్రాక్ నిర్మించుకుందనేది స్థానికంగా పెద్ద ఎత్తున వినిపిస్తున్న విమర్శ.2009లో ఈ మైనింగ్ భూమిని అనుకొని ప్రభుత్వం రైల్వేలైన్ నిర్మించింది. ప్రభుత్వం నిర్మించిన రైల్వేలైన్ కింద మైహోమ్ సిమెంట్స్ మైనింగ్ భూమి కొంతమేర కోల్పోయింది. మైహోమ్ సిమెంట్స్ సైతం మైనింగ్ భూమిలో ఏకంగా తమ అవసరార్థం రైల్వే లైన్ నిర్మించింది. ఇది కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వ శాఖ జారీచేసిన ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పరచారనేది ప్రధాన అభియోగం. ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ పత్రంలో కేంద్ర ప్రభుత్వం విధించిన నిబంధన ప్రకారం మాత్రమే మైనింగ్ నిర్వహించాల్సి ఉన్నా అందుకు భిన్నంగా మైహోమ్ సిమెంట్స్ వ్యవహరిస్తుందనీ కొందరు బాహాటంగానే విమర్శిస్తున్నారు.మై హోమ్ సిమెంట్స్ తమ కంపెనీ అవసరార్థం రైల్వే ట్రాక్ నిర్మించుకోవాల్సి వస్తే తన సొంత భూమిలో నిర్మించుకోవాల్సి ఉన్న నిబంధనలకు విరుద్ధంగా సున్నపురాయి మైనింగ్ కోసం కేటాయించిన భూమిలో పర్యావరణాన్ని అనుమతులకు విరుద్ధంగా రైల్వే ట్రాక్ నిర్మించిందనీ ప్రధానంగా వినిపిస్తున్న విమర్శ. ఈ మైనింగ్ భూమి కాకుండా సర్వేనెంబర్ 1057లోని పట్టా భూముల్లో రైల్వే ట్రాక్, లోడింగ్ అన్లోడింగ్ పాయింట్ నిర్మించినప్పటికీ కనీసం గ్రామపంచాయతీ నుండి కూడా ఎటువంటి అనుమతులు తీసుకోలేదనేధి కొందరు స్థానికుల వాదన. .2015లో నిర్మించిన ఈ రైల్వే లోడింగ్ పాయింట్ కి ఇప్పటివరకు కనీసం ఇటువంటి పన్నులు కూడా చెల్లించలేదని విశ్వసనీయంగా తెలిసింది. ఈ రైల్వే ట్రాక్, లోడింగ్ పాయింట్ 12 హెక్టార్లలో మైహోమ్ సిమెంట్ నిర్మించగా, రైల్వే ట్రాక్ కోసం 6 హెక్టార్ల మైనింగ్ లీజు భూమిని వాడుకున్నట్లు తెలిసింది.ఆరు నెలలకు ఒకసారి సున్నపురాయి మైనింగ్ కోసం మైహోమ్ సిమెంట్స్ పర్యావరణ అనుమతులు కొనసాగిస్తుండగా, అదేవిధంగా ఎప్పటికప్పుడు మైనింగ్ కార్యకలాపాలపై ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ కేంద్ర ప్రభుత్వ సంస్థ లెక్కలు కడుతున్నప్పటికీ మైనింగ్ భూమిలో మైహోమ్ సిమెంట్ నిర్మించిన రైల్వేట్రాక్ పై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. బహిరంగంగా పర్యావరణ అనుమతులకు ఉల్లంఘించినప్పటికీ పర్యావరణ శాఖ ఇటువైపున కన్నెత్తి చూడదదంలేదు అని పలువురు విమర్శిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కన్నుసన్నల్లో నడిచే సున్నపురాయి మైనింగ్ పై మిన్ను కుండటం పట్ల సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అక్రమ నిర్మాణపై విచారణ జరిపి మైహోం సంస్థ పై చర్యలు తీసుకోవాల్సిందిగా స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మెట్రో ప్రాజెక్ట్...
### 820 కోట్ల నష్టపరిహారం...

హైదరాబాద్, జూన్ 10,

హైదరాబాద్ పాతబస్తీలో మెట్రో రైలు ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈ ప్రాజెక్టు కోసం చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. మొత్తం 888 ఆస్తులకు గాను 825 ఆస్తుల సేకరణ పూర్తయిందని, ఇది దాదాపు 93 శాతానికి సమానమని మెట్రో రైలు అధికారులు వెల్లడించారు.మిగిలిన ఆస్తులలో మూడు పురాతన కట్టడాలు వారసత్వ కట్టడాల పరిరక్షణ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. 10 కోర్టు కేసులతో పాటు, మరికొన్ని ఆస్తుల వివాదాలు భూసేకరణ, పునరావాసం, రీసెటిల్‌మెంట్ అథారిటీ (ఎల్ఏఆర్ఆర్) పరిధిలో ఉన్నాయి. కొన్ని ఆస్తులు వక్ఫ్ బోర్డుకు చెందినవని తెలియక గతంలోనే కొనుగోలు చేశామని, ఇప్పుడు నోటీసులు ఇవ్వడంతో వివాదాలు మొదలయ్యాయని కొందరు పేర్కొంటున్నారు.బాధితులకు ఇప్పటికే సుమారు రూ. 820 కోట్ల పరిహారం చెల్లించినట్లు అధికారులు తెలిపారు. ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు 7.5 కి.మీ. మార్గంలో దారుల్‌షిఫా, పాత హవేలీ, హరిబౌలి, అలీజా కోట, శాలిబండ, పంషీర్‌గంజ్, ఫలక్‌నుమా మీదుగా ఈ ప్రాజెక్టు వెళ్తుంది. చారిత్రక కట్టడాలకు హాని కలగకుండా పనులు చేపడుతున్నామని, అలీయాబాద్ వంటి ప్రాంతాల్లో త్వరలో కూల్చివేతలు జరిపి రోడ్డు విస్తరణ చేస్తామని అధికారులు వివరించారు. దీని పర్యవేక్షణ కోసం జనరల్ కన్సల్టెన్సీకి టెండర్లు పిలిచారు.

## అంబులెన్స్లోనే సుఖప్రసవం.. 108 సిబ్బంది సమయస్ఫూర్తితో తల్లీబిడ్డలు క్షేమం

మేడ్చల్ఉప్పల్ నియోజకవర్గంలోని నాచారం ప్రాంతానికి చెందిన నిషా భాను (27), రెండో కాన్పు సమయం రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఉప్పల్ 108 అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ నాగరాజు, పైలట్ ఉపేందర్ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని గర్భిణిని ఆస్పత్రికి తరలించడం ప్రారంభించారు. అయితే మార్గమధ్యలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో డాక్టర్ల సూచనలతో, అంబులెన్స్లోనే ప్రసవం నిర్వహించారు. సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో నిషా భాను పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. అనంతరం తల్లి, శిశువును సురక్షితంగా ఉప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స కోసం చేర్పించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అత్యవసర పరిస్థితిలో చాకచక్యంగా స్పందించి సురక్షిత ప్రసవం జరిపిన ఉప్పల్ 108 అంబులెన్స్ సిబ్బంది నాగరాజు, ఉపేందర్ల సేవలను కుటుంబ సభ్యులు, స్థానికులు ప్రశంసించారు. వారి సమయస్ఫూర్తి కారణంగా తల్లీబిడ్డలు సురక్షితంగా ఉండటంతో అందరూ హర్షం వ్యక్తం చేశారు.

## మరణం తర్వాత కూడా జీవించండి..
### నేత్ర దానంతో ఇద్దరికి చూపునివ్వండి.".. డా అడ్డాల



కాకినాడ జూన్ 10,

స్థానిక రమణయ్య పేట వద్ద ఉన్న అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ నేత్రదాన దినోత్సవం సందర్భంగా డా అడ్డాల ఆధ్వర్యంలో ఆడబాల ట్రస్ట్ సభ్యులు మరియు మహిళలు నేత్ర దాన సంకల్ప పత్రాల పైన సంతకాలు చేశారు. ఈ సందర్భంగా డా అడ్డాల మాట్లాడుతూ "ప్రతి సంవత్సరం జూన్ 10వ తేదీన ప్రపంచ నేత్రదాన దినోత్సవం జరుపుకుంటామని, అంధత్వ నివారణపై అవగాహన పెంచడం మరియు మరణానంతరం నేత్రదానం చేసేలా ప్రజలను ప్రోత్సహించడం ఈ రోజు యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని,కార్నియా (కంటి నల్లగుడ్డు పై పొర) దెబ్బతినడం వల్ల చూపు కోల్పోయిన వారికి నేత్ర మార్పిడి ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని,మరణించిన ఒక వ్యక్తి నుంచి సేకరించిన రెండు కళ్ల ద్వారా, ఇద్దరు అంధులకు తిరిగి చూపు ప్రసాదించవచ్చని, యువకులు నుంచి వృద్ధుల ?వరకు ఎవరైనా నేత్ర దానం చేయవచ్చని, ?కంటి అద్దాలు వాడుతున్నవారు, శుక్లాల సర్జరీ అయినవారు కూడా నేత్రదానానికి అర్హులే అని ,?మధుమేహం రక్తపోటు , ఆస్తమా ఉన్నవారు కూడా కళ్లను దానం చేయవచ్చని అన్నారు. ?వ్యక్తి మరణించిన వెంటనే వీలైనంత త్వరగా (గరిష్టంగా 6 గంటల లోపు) సమీపంలోని ఐ బ్యాంక్ కు సమాచారం అందించాలని ,ఐ బ్యాంక్ టీమ్ వచ్చే లోపుమరణించిన వ్యక్తి కనురెప్పలను మూసి ఉంచి, ఫ్యాన్ ఆపేసి, కళ్లపై తడి దూది లేదా తడి గుడ్డను ఉంచడం ద్వారా కార్నియా ఎండిపోకుండా కాపాడవచ్చని ,తల కింద ఐదు ఇంచుల ఎత్తు ఉండేలా దిండు పెట్టాలని, వైద్య బృందం వచ్చి కేవలం 15-20 నిమిషాల్లో కంటి పొరను సేకరిస్తారని ,మనం జీవించి ఉన్నప్పుడే నేత్రదాన సంకల్ప పత్రం పై సంతకం చేయడం మరియు మన నిర్ణయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడం ద్వారా ఈ మహత్కార్యంలో భాగస్వాములం కావచ్చని తెలిపారు. మనం మరణించిన తర్వాత కూడా ఇద్దరి జీవితాలలో వెలుగు నింపవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, ప్రసాద్ నాయుడు, నమఃశివాయ, మహిళలు పాల్గొన్నారు.

## నిఘానేత్రంలో ఆదిలాబాద్ జిల్లా 300 నూతన సీసీటీవీ కెమెరాలను ప్రారంభించిన రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్





ఆదిలాబాద్ జూన్ 10,

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడం, నేరాల నియంత్రణ మరియు విచారణను సమర్థవంతంగా నిర్వహించడం కోసం ఏర్పాటు చేసిన 300 నూతన సీసీటీవీ కెమెరాలను రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్థానిక కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రారంభించారు. మొదటగా స్థానిక పోలీస్ గెస్ట్ హౌస్ నందు జిల్లా సాయుధ సిబ్బంది గౌరవ వందనాన్ని సమర్పించడం జరిగింది. తదుపరి ప్రాంగణంలో ఒక మొక్కను నాటి పచ్చదనం ప్రాముఖ్యతను తెలియజేశారు.జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఈ కెమెరాలలో 220 సీసీటీవీ కెమెరాలు గ్రామీణ ప్రాంతాలలో, 80 సీసీటీవీ కెమెరాలు పట్టణ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కెమెరాల ద్వారా ప్రజల రక్షణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, నేరాల నివారణ, నిందితుల గుర్తింపు వంటి అంశాలలో పోలీసు శాఖకు మరింత సహకారం అందనుంది.ఈ సందర్భంగా రాష్ట్ర డీజీపీ మాట్లాడుతూ.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మరింత మెరుగైన భద్రతా సేవలు అందించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ, సీఐడీ, ఏసీబీ డీజీ చారు సిన్హామల్టీజోన్-1 ఐజీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ అడ్మిన్ పి. మౌనిక, ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి కొట్టే, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, పట్టణ సీఐ బి. సునీల్ కుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దేశ చరిత్రలో మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం: కొత్త దిశ నిర్దేశించింది :మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట ప్రముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం మహిళా సాధికారత దిశగా దేశానికే ఆదర్శంగా నిలిచే కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే కాకుండా, వారిని ఆర్టీసీ బస్సుల యజమానులుగా తీర్చిదిద్దిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని మంత్రి పేర్కొన్నారు. మహిళా శక్తి పథకం కింద మండల మహిళా సమాఖ్యలు తమ సొంత నిధులైన రూ.199.08 కోట్ల పెట్టుబడితో 553 టిజి ఎస్ఆర్ టిసి బస్సులను కొనుగోలు చేసి సంస్థకు అద్దెకు ఇవ్వడం మహిళల ఆర్థిక స్వావలంబనకు, సమిష్టి శక్తికి ప్రతీకగా నిలిచిందన్నారు.ఒకప్పుడు రుణాల కోసం ఎదురుచూసిన స్వయం సహాయక సంఘాల మహిళలు నేడు ఆస్తుల యజమానులుగా, పెట్టుబడిదారులుగా ఎదగడం తెలంగాణ ప్రభుత్వ మహిళా సాధికారత విధానాలకు నిదర్శనమని మంత్రి తెలిపారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 అద్దె లభిస్తుండగా, మొత్తం 553 బస్సుల ద్వారా ప్రతి నెల రూ.3.84 కోట్ల ఆదాయం మహిళా సమాఖ్యలకు అందుతోందన్నారు. ఇప్పటివరకు రూ.20.34 కోట్ల అద్దె ఆదాయం మహిళా సంఘాలకు చేరడం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా చాటుతోందని చెప్పారు.ఈ కార్యక్రమం ద్వారా మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములు, ఆస్తుల యజమానులు, ఆదాయ సృష్టికర్తలుగా మారుతున్నారని మంత్రి పేర్కొన్నారు.

# వికసిత్ భారత్ దిశగా 12 ఏళ్ల విజ్ఞాన శాస్త్ర ప్రయాణం

# రచయిత : డా.జితేంద్ర సింగ్

## కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి

==============================



జమ్మూలోని దోడా జిల్లాకు చెందిన ఒక లావెండర్ రైతు, మొదటి కాపు పువ్వులను కోసేటప్పుడు శాస్త్ర సాంకేతిక విధానాల గురించి ఆలోచించకపోవచ్చు. కానీ, గత దశాబ్ద కాలంగా లక్ష్యశుద్ధితో, ప్రణాళికాబద్ధంగా శాస్త్ర సాంకేతిక రంగాలలో చేసిన పెట్టుబడులే ఆ కేంద్రపాలిత ప్రాంతంలోని ఎడారి కొండలను సువాసనలు వెదజల్లే ఊదా రంగు పొలాలుగా మార్చాయి. ప్రయోగశాలల్లో పుట్టిన సాంకేతికత గ్రామీణ ప్రజల జీవనోపాధిని ఎలా విప్లవాత్మకంగా మార్చగలదో చెప్పడానికి ఇదొక సజీవ సాక్ష్యం.

భారతదేశంలో గత పన్నెండేళ్లుగా శాస్త్ర సాంకేతిక రంగాల పట్ల ప్రభుత్వం చూపిన అంకితభావానికి అసలు సిసలైన అర్థం ఇదే. సైన్స్ అంటే కేవలం జ్ఞానాన్ని పెంపొందించుకోవడమే కాదు, అది మన పౌరుల దైనందిన జీవితాల్లో ఒక జీవనాధార శక్తిగా మారాలనేది మా సంకల్పం. 2014లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టినప్పుడు, సైన్స్‌ను కేవలం ఒక ప్రభుత్వ శాఖగా కాకుండా ఒక జాతీయ మిషన్‌గా భావించాలని సరికొత్త దృక్పథాన్ని దేశం ముందుంచారు. ఆ తర్వాతి సంవత్సరాలు ఆ విజన్‌ను ఎంత అద్భుతంగా నిజం చేశాయంటే, గతంలో అసలు ఊహించని విజయాలను నేడు చూస్తున్నాం.

నేడు భారతదేశం చంద్రుని దక్షిణ ధ్రువంపై ఒక అంతరిక్ష నౌకను విజయవంతంగా దించింది. చరిత్రలో మొదటిసారిగా స్వదేశీ యాంటీబయాటిక్‌ను అభివృద్ధి చేసింది. పూణే నుండి పాట్నా వరకు సూపర్ కంప్యూటర్లను నిర్మించింది. దేశీయ స్టార్టప్‌లతో కళకళలాడే సరికొత్త అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను సృష్టించింది. కానీ, వీటన్నింటి వెనుక ఉన్న అసలైన కథ.. ఈ ప్రతీ విజయం సామాన్య మానవుడి జీవితాన్ని ఎలా తాకింది.? ఎలా మార్చింది? అనేదే.

సైన్స్ ఇప్పుడు ప్రయోగశాలలకే పరిమితం కాలేదు; అది జాతీయ అభివృద్ధికి, పౌరుల సాధికారతకు అత్యంత శక్తివంతమైన చోదక శక్తిగా మారింది.

భారతీయ వ్యవసాయ రంగాన్ని శాసించే వాతావరణం, గత దశాబ్ద కాలంలో రైతులకు మరింత సులభంగా అర్థమయ్యేలా మారింది. మన భూ పరిశీలన, వాతావరణ ముందస్తు అంచనా మౌలిక సదుపాయాలను పూర్తిగా ఆధునీకరించడం వల్ల, నేడు రైతులకు అత్యంత ఖచ్చితమైన, స్థానిక వాతావరణ సమాచారం అందుతోంది. "బహుశా వర్షం పడవచ్చు" అనే అస్పష్టమైన అంచనాల స్థానంలో, "రేపు పంట కోయాలా వద్దా" అని ఒక కుటుంబం ఖచ్చితమైన నిర్ణయం తీసుకోగలిగేంత సాంకేతికత పెరిగింది. నేడు బంగాళాఖాతంలో ఒక తుఫాను ఏర్పడితే, మన ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు తీరప్రాంత ప్రజలకు గంటల ముందే, కొన్నిసార్లు రోజుల ముందే సమాచారాన్ని అందిస్తున్నాయి. దీనివల్ల ఎంతో మంది ప్రాణాలు, జీవనోపాధులు సురక్షితంగా కాపాడబడుతున్నాయి.

జమ్మూ కాశ్మీర్‌లోని పర్వత లోయలలో, సైన్స్ అనేది 'అరోమా మిషన్' (సుగంధ ద్రవ్యాల మిషన్) రూపంలో అడుగుపెట్టింది. ఈ కార్యక్రమం ద్వారా లావెండర్ సాగును పరిచయం చేయడమే కాకుండా, రైతులకు అవసరమైన సాంకేతికత, విత్తనాలు, మార్కెట్ సదుపాయాలను కల్పించాం. ఒక చిన్న ప్రయోగంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్, ఈ రోజు భారతదేశంలో "పర్పుల్ రివల్యూషన్" గా రూపాంతరం చెందింది. సైన్స్ అండతో వేలాది రైతు కుటుంబాలు ఈ రోజు సుగంధ, ఔషధ మొక్కల ద్వారా గౌరవప్రదమైన ఆదాయాన్ని పొందుతున్నాయి. కుంకుమపువ్వు సాగు విస్తరణ, ఔషధ మూలికల పెంపకం, భారతదేశంలోనే మొదటిసారిగా ఇంగువ సాగును పరిచయం చేయడం వంటి పనులు, మట్టిలో పుట్టిన ఆవిష్కరణలు పారిశ్రామిక సాంకేతికతతో సమానంగా మార్పును తీసుకురాగలవని నిరూపించాయి.

గ్రామీణ సాధికారత అనేది కేవలం వ్యవసాయానికే పరిమితం కాలేదు. తక్కువ ఖర్చుతో కూడిన గ్రామీణ గృహాల నిర్మాణం కోసం రూపొందించిన '3ఐ-ప్రింటెడ్ హౌసింగ్ ప్రొటోటైప్స్' నుంచి, ఆహార కల్తీని గుర్తించే 'ఏఐ-ఆధారిత వ్యవస్థల' వరకు, పేద ప్రజల సమస్యలను పరిష్కరించడానికి సాంకేతికతను ఉద్దేశపూర్వకంగా మళ్లిస్తున్నాము. కంప్యూటింగ్, సెన్సింగ్, ఫిజికల్ ఇంజనీరింగ్‌ను అనుసంధానించే "నేషనల్ మిషన్ ఆన్ ఇంటర్ డిసిప్లినరీ సైబర్-ఫిజికల్ సిస్టమ్స్" దేశవ్యాప్తంగా 25 టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేసింది. ఇవి సూక్ష్మ వ్యవసాయం, స్వచ్ఛమైన నీటి లభ్యత, గ్రామీణ ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో పనిచేసే వెయ్యికి పైగా స్టార్టప్‌లకు ఊతమిచ్చాయి.

బయోటెక్నాలజీ రంగంలో సరికొత్త విప్లవం

భారతీయ విజ్ఞాన శాస్త్ర ప్రతిభకు బయోటెక్నాలజీ, ఆరోగ్య సంరక్షణ రంగాలు ఒక అద్దం పడుతున్నాయి. దశాబ్దాలుగా, భారతదేశ ఫార్మా బలం కేవలం జనరిక్ ఔషధాల తయారీలోనే ఉండేది. కానీ ఇప్పుడు ఆ కథ మారుతోంది. దేశీయంగా కనుక్కున్న సరికొత్త యాంటీబయాటిక్ 'నాఫిత్రోమైసిన్' అభివృద్ధి, కేవలం ఒక శాస్త్రీయ మైలురాయి మాత్రమే కాదు; అది ఫార్మాస్యూటికల్ రంగంలో భారతదేశ స్వయం సమృద్ధికి నిదర్శనం. ప్రభుత్వ సహకారంతో పరిశోధకులు, పరిశ్రమలు కలిసి చేసిన ఈ ఆవిష్కరణ, ప్రపంచంలోని కొన్ని దేశాలు మాత్రమే చేయగలిగే ఔషధ ఆవిష్కరణ ప్రయోగశాలల స్థాయికి భారతదేశం చేరుకుందని నిరూపించింది.

అదేవిధంగా, వెల్లూరులోని క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ (జవీజ) లో హీమోఫిలియా వ్యాధి కోసం నిర్వహించిన దేశపు మొట్టమొదటి విజయవంతమైన స్వదేశీ 'జీన్ థెరపీ' క్లినికల్ ట్రయల్స్ మరొక అద్భుత ఘట్టం. జీవితాంతం ఖరీదైన చికిత్స అవసరమయ్యే ఈ వ్యాధికి జీన్ థెరపీ కేవలం లక్షణాలను తగ్గించడమే కాకుండా, లోపభూయిష్టమైన జన్యువును సరిచేస్తుంది. జన్యుపరమైన వ్యాధుల భారం ఎక్కువగా ఉన్న మన దేశానికి ఇది ఒక గొప్ప వరం. దీనితో పాటు, భారతదేశంలోని విభిన్న జనాభా నుండి 10,000 కి పైగా మానవ జన్యువులను సీక్వెన్స్ చేసిన "జీనోమ్ ఇండియా ప్రాజెక్ట్" ద్వారా ప్రతి రోగి ప్రత్యేక జీవశాస్త్రానికి అనుగుణంగా వైద్యం అందించే భవిష్యత్తుకు బలమైన పునాది పడింది.

కోవిడ్-19 మహమ్మారి సమయంలో దేశీయ బయోమెడికల్ సామర్థ్యం జాతీయ భద్రతకు ఎంత ముఖ్యమో మనకు అర్థమైంది. 140 కోట్ల జనాభాకు సరిపడా వ్యాక్సిన్‌లను స్వదేశంలోనే అభివృద్ధి చేసి, తయారు చేసి, పంపిణీ చేయడం వెనుక బయోటెక్నాలజీ రంగంలో మనం చేసిన ఎన్నో ఏళ్ల పెట్టుబడి ఉంది. 'బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్' (దీ×=ూజ) బయోటెక్ స్టార్టప్‌లను ప్రోత్సహించడంలో, అకడమిక్ పరిశోధనలను వాణిజ్య స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించింది. నేడు, సరికొత్త తరం బయో-ఎంట్రప్రెన్యూర్లు కేవలం సిలికాన్ వ్యాలీ నుంచి కాకుండా, భారతీయ నగరాలు, క్యాంపస్‌ల నుండే ప్రెసిషన్ మెడిసిన్, సుస్థిర బయో-మెటీరియల్స్, నెక్స్ట్-జనరేషన్ డయాగ్నోస్టిక్స్ వంటి రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తున్నారు.

అంతరిక్షంలో అప్రతిహత విజయాలు: అందరి కోసం అంతరిక్షం

2023 ఆగస్టు 23న, చంద్రయాన్-3కి చెందిన విక్రమ్ ల్యాండర్ చంద్రుని దక్షిణ ధ్రువంపై -- ఇప్పటివరకు ఏ దేశమూ చేరని ప్రాంతంలో అడుగుపెడుతున్నప్పుడు, కోట్ల మంది భారతీయులు ఊపిరి బిగబట్టి చూశారు. ఆ క్షణం కేవలం ఒక సాంకేతిక విజయం మాత్రమే కాదు, అది ఒక జాతీయ ఆత్మవిశ్వాసం. ఈ ల్యాండింగ్ భారతదేశానికి మాత్రమే కాదు, ప్రపంచ అంతరిక్ష విజ్ఞానానికే ఎంతో కీలకమైన సమాచారాన్ని అందించింది. కానీ అంతకంటే ముఖ్యంగా, ఈ విజయం దేశంలోని కోట్లాది మంది యువతలో ఒక సరికొత్త ఆలోచనా దృక్పథాన్ని, ఆకాంక్షను రగిల్చింది.

గత పన్నెండేళ్లలో భారతదేశ అంతరిక్ష ప్రయాణం అటు ప్రతిష్టాత్మక లక్ష్యాలను, ఇటు సామాన్యుడికి ఉపయోగపడే సౌకర్యాలను సమాంతరంగా సాధిస్తూ సాగింది. చంద్రయాన్-3 ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తే, అదే సమయంలో మన మొదటి సోలార్ అబ్జర్వేటరీ 'ఆదిత్య-ఎల్1' (ూంఎత్ఝ-ూ1) సూర్యుడిపై పరిశోధనలను నిశ్శబ్దంగా ప్రారంభించింది. ఇది భూమిపై ఉన్న పవర్ గ్రిడ్‌లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, శాటిలైట్లను ప్రభావితం చేసే అంతరిక్ష వాతావరణాన్ని అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, అంతరిక్షంలో రెండు నౌకలను అనుసంధానించే సామర్థ్యాన్ని నిరూపించిన 'స్పేడెక్స్' (ూజుఝణవశ) మిషన్ ద్వారా భారతదేశం ప్రపంచంలోని కొన్ని శక్తివంతమైన దేశాల సరసన నిలిచింది. ఇది మన భవిష్యత్తు అంతరిక్ష కేంద్రాల నిర్మాణానికి ఎంతో కీలకం. గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (×ూూ) లో గడిపిన చారిత్రాత్మక 18 రోజుల ప్రయాణం, మానవ అంతరిక్ష యాత్రలో భారతదేశ కలలను నిజం చేసింది.

భారతదేశ అంతరిక్ష రంగంలో వచ్చిన మార్పు కేవలం ఈ మిషన్లకే పరిమితం కాలేదు. 'ఇండియన్ స్పేస్ పాలసీ 2023' ద్వారా ప్రైవేట్ రంగానికి అంతరిక్ష ద్వారాలను పూర్తిగా తెరిచాము. దీని ఫలితం అద్భుతంగా ఉంది. 2014 లో కేవలం 11 గా ఉన్న అంతరిక్ష స్టార్టప్‌ల సంఖ్య, ఈ రోజు 400 కు పైగా పెరిగింది. వీరు రాకెట్లను నిర్మిస్తున్నారు, శాటిలైట్లను డిజైన్ చేస్తున్నారు, వ్యవసాయ పర్యవేక్షణ నుంచి విపత్తు నిర్వహణ వరకు ఉపయోగపడే అప్లికేషన్లను సృష్టిస్తున్నారు. 2014 నుంచి ఇప్పటివరకు భారతీయ ఉపగ్రహ వాహక నౌకలు 399 విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చి, ప్రపంచ అంతరిక్ష సంస్థలకు భారతదేశాన్ని నమ్మకమైన భాగస్వామిగా నిలబెట్టాయి. 2035 నాటికి మన స్వంత అంతరిక్ష కేంద్రం 'భారతీయ అంతరిక్ష స్టేషన్' మరియు 2040 నాటికి చంద్రునిపైకి మానవ సహిత మిషన్‌ను పంపడమే లక్ష్యంగా మన ప్రయాణం సాగుతోంది.

ఆవిష్కరణల ద్వారా 'ఆత్మనిర్భరత'

'ఆత్మనిర్భర భారత్' అనేది కేవలం ఒక రాజకీయ నినాదం కాదు. శాస్త్ర సాంకేతిక రంగంలో అది మన పాలనా తత్వంగా మారింది. రూ.6,000 కోట్లకు పైగా బడ్జెట్‌తో ప్రారంభించిన 'నేషనల్ క్వాంటమ్ మిషన్' కేవలం ఒక సాంకేతిక పెట్టుబడి మాత్రమే కాదు; 21వ శతాబ్దపు అత్యంత కీలకమైన సాంకేతిక పోటీలో భారతదేశ వ్యూహాత్మక స్థానాన్ని సుస్థిరం చేసే అడుగు. క్వాంటమ్ కంప్యూటింగ్, సురక్షితమైన క్వాంటమ్ కమ్యూనికేషన్, వైద్య పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చే సెన్సింగ్ సామర్థ్యాలను మనం స్వదేశంలోనే విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్మిస్తున్నాము.

'నేషనల్ సూపర్‌కంప్యూటింగ్ మిషన్' ద్వారా దేశవ్యాప్తంగా పూణే, చెన్నై, ఖరగ్‌పూర్ వంటి నగరాల్లో హై-పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను విస్తరించాము. దీనితో పాటు, భారతదేశపు మొట్టమొదటి ప్రభుత్వ నిధులతో నడిచే మల్టీలింగ్వల్ జనరేటివ్ ూ× ప్రోగ్రామ్ 'భారత్‌జెన్' (దీష్ణుతీఢ్+వఅ), భారతీయ భాషలలో ఆలోచించగల, కమ్యూనికేట్ చేయగల లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ (ూవీం) ను అభివృద్ధి చేస్తోంది. దీనివల్ల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రయోజనాలు కేవలం ఇంగ్లీష్ మాట్లాడే వారికే కాకుండా, సామాన్య భారతీయులందరికీ అందుతాయి.

స్వయం సమృద్ధి సాధనలో సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) పాత్ర ఎంతో అభినందనీయం. స్వదేశీ సాంకేతికతతో రూపొందించిన 'నూచీూూ-చీ+' ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్, భారతదేశపు మొట్టమొదటి హైడ్రోజన్ ఫ్యూయల్-సెల్ పవర్డ్ షిప్, సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (సుస్థిర విమాన ఇంధనం) పై జరుగుతున్న పరిశోధనలు విదేశీ సాంకేతికతపై మన ఆధారపడటాన్ని తగ్గిస్తున్నాయి. ప్రయోగశాల పరిశోధనలు, వ్యవస్థాపక శక్తులు ఒకచోట చేరేలా 'సీఎస్ఐఆర్ ఇన్నోవేషన్ కాంప్లెక్స్' ను ఏర్పాటు చేశాము, ఇది ఒక శాస్త్రీయ ఆలోచనను త్వరగా మార్కెట్ ప్రొడక్ట్‌గా మార్చడానికి సహాయపడుతుంది.

ఇంధన భద్రత మరియు భవిష్యత్ సాంకేతికతలు

భారతదేశ శాస్త్రీయ పరివర్తనలో అణుశక్తి రంగంలో సాధించిన వ్యూహాత్మక పురోగతి ఎంతో ముఖ్యమైనది. ఏప్రిల్ 2026 లో కల్పక్కంలోని 500 వీఔవ 'ప్రొటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్' (ూఖీదీ=) మొదటిసారిగా క్రిటికాలిటీని సాధించడం ఒక చారిత్రాత్మక మైలురాయి. భారతీయ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఈ రియాక్టర్, భారతదేశ మూడు దశల అణు కార్యక్రమంలో రెండవ దశకు కీలకమైన వంతెన. మన మట్టిలో పుష్కలంగా ఉన్న థోరియం నిల్వలను ఉపయోగించుకోవడానికి ఇది మార్గం సుగమం చేస్తుంది. పర్యావరణ మార్పుల నేపథ్యంలో, స్వదేశీ ఇంధనంతో స్వచ్ఛమైన, నిరంతర విద్యుత్‌ను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు; అది దేశ సార్వభౌమ భద్రతకు సంబంధించిన విషయం.

అణుశక్తి రంగం వైద్య రంగంలోనూ అద్భుతాలు చేస్తోంది. టాటా మెమోరియల్ హాస్పిటల్‌ను అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (×ూజుూ) 'రేస్ ఆఫ్ హోప్' యాంకర్ సెంటర్‌గా గుర్తించడం, హోమి భాభా క్యాన్సర్ హాస్పిటల్ నెట్‌వర్క్ విస్తరణ, అధునాతన రేడియో ఫార్మాస్యూటికల్స్ పంపిణీ ద్వారా దేశవ్యాప్తంగా రోగులకు ప్రపంచ స్థాయి క్యాన్సర్ సంరక్షణను అందుబాటులోకి తెస్తున్నాము. 'ది శాంతి యాక్ట్ ఆఫ్ 2025' (ూష్ట్రవ ూనూచీ× ూష్ శీట 2025) ద్వారా అణు రంగ చట్టపరమైన మౌలిక వసతులను ఆధునీకరించి, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులకు, ప్రైవేట్ భాగస్వామ్యానికి అవకాశం కల్పించాం.

మరోవైపు, 'డీప్ ఓషన్ మిషన్' ద్వారా భూమిపై ఇంకా అన్వేషించని సముద్ర గర్భంలోకి మన శాస్త్రీయ పరిధిని విస్తరిస్తున్నాము. మన సముద్రగర్భంలో స్వచ్ఛమైన ఇంధన సాంకేతికతలకు అవసరమైన పాలిమెటాలిక్ నోడ్యూల్స్, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాల నిల్వలు ఉన్నాయి, ఇవి విదేశీ దిగుమతులపై మన ఆధారపడటాన్ని తగ్గిస్తాయి. సముద్రగర్భ పరిశోధనలకు అవసరమైన అండర్ వాటర్ వెహికల్, సెన్సార్ సాంకేతికతలను కూడా మనమే సొంతంగా అభివృద్ధి చేసుకుంటున్నాము.

వికసిత్ భారత్: గమ్యస్థానంగా సైన్స్

2047 నాటికి -- మన స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి భారతదేశాన్ని పూర్తి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రయాణంలో శాస్త్ర సాంకేతిక రంగాలే అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. గత 12 ఏళ్లలో చేసిన పెట్టుబడులు కేవలం సంస్థలను, మౌలిక సదుపాయాలను మాత్రమే కాకుండా, దేశంలో ఒక శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని, స్టార్టప్ సంస్కృతిని, జాతీయ ఆత్మవిశ్వాసాన్ని సృష్టించాయి.

దేశ పరిశోధనా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్', ఒక లక్ష కోట్ల రూపాయల భారీ కార్పస్‌తో కొత్తగా ఏర్పాటు చేసిన 'రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ ఫండ్' లు మన మేధో సంపత్తిపై భారతదేశం పెట్టిన అతిపెద్ద నమ్మకం. మన దేశ సవాళ్లకు పరిష్కారాలు మన స్వంత ల్యాబ్‌లు, క్యాంపస్‌లు, సమాజాల నుండే వస్తాయనే నమ్మకానికి ఇవి ప్రతీకలు.

దోడాలోని లావెండర్ రైతు, వెల్లూరులోని జెనోమిక్స్ పరిశోధకుడు, బెంగళూరులోని స్పేస్ స్టార్టప్ వ్యవస్థాపకుడు, కల్పక్కంలోని న్యూక్లియర్ ఇంజనీర్ -- వీరంతా ఒకే కథలోని విభిన్న పాత్రధారులు. సైన్స్‌ను దేశ అభివృద్ధికి కేంద్ర బిందువుగా మార్చుకున్న ఒక నవ భారత ప్రగతి ప్రయాణమే ఈ కథ. గత పన్నెండేళ్ల కాలంలో మనం నిర్మించుకున్నది కేవలం విజయాల జాబితాను మాత్రమే కాదు, రాబోయే కాలంలో ఒక వికసిత, ఆత్మనిర్భర, శాస్త్రీయంగా అగ్రగామిగా నిలిచే భారతదేశానికి బలమైన, లోతైన, విశాలమైన పునాదిని.

# రెసిడెన్షియల్ విద్యాలయం పనుల్లో వేగం పెంచాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

## రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలో నిర్మాణ పనుల పరిశీలన



భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, జూన్ 10: రుద్రంగి మండలం గైదిగుట్ట తండాలో ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) విద్యాలయం భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రుద్రంగి మండలం గైదిగుట్ట తండా ట్రైబల్ వెల్ఫేర్ అప్ గ్రేడెడ్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ (గర్ల్స్) భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా, బుధవారం జిల్లా కలెక్టర్ తరగతి గదులు, హాస్టల్ భవనం, ఇతర నిర్మాణ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్, అధికారులు మొక్కలు నాటారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నిర్ణీత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.పరిశీలనలో రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సంగీత, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసాచారి, తహసీల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# టెక్స్‌టైల్ పార్క్‌పై జిల్లా కలెక్టర్ సమీక్ష.

భారత శక్తి, రాజన్న సిరిసిల్ల, జూన్ 10: సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్ పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు.టెక్స్‌టైల్ పార్క్‌లోని వివిధ అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత జౌళి శాఖ అధికారులు, పరిశ్రమల శాఖ, ఇరిగేషన్ శాఖ, మిషన్ భగీరథ శాఖలకు చెందిన అధికారులు,టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ బాధ్యులతో బుధవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్క్‌లోని ప్లాట్ల బదిలీకి సంబంధించిన ఎన్ఓసీల జారీ, టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి సరఫరా, కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (సీఈటీపీ)వినియోగం, కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్సీ ) ఏర్పాటు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు జారీ చేస్తూ, టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్లాట్ల బదిలీ, ఎన్ఓసీల జారీకి సంబంధించి అందిన అర్హత కలిగిన దరఖాస్తులను వీలైనంత త్వరగా స్టేట్ లెవల్ కమిటీ సమావేశంలో పరిశీలనకు ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి సరఫరా కోసం ఇరిగేషన్ మిషన్ భగీరథ అధికారులతో కలిసి టెక్స్‌టైల్ పార్క్‌కు నీటి లభ్యత ఉన్న ప్రత్యామ్నాయ వనరులను గుర్తించాలని సూచించారు. టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటు చేసిన కామన్ ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భవిష్యత్తులో డైయింగ్, ప్రాసెసింగ్ వంటి యూనిట్లు ఏర్పాటు అయితే సీఈటీపీ సమర్థవంతంగా వినియోగించుకునేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ పై సమగ్ర ప్రతిపాదన సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో చేనేత, జౌళి సహాయ సంచాలకులు సంతోష్ కుమార్, ఈఈ మిషన్ భగీరథ ముజాహిబ్ అన్వర్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం హన్మంతు, టెక్స్‌టైల్ పార్క్ అసోసియేషన్ సభ్యులు, యూనిట్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# కడుపునొప్పి భరించలేక నర్సింగ్ విద్యార్థిని ఆత్మహత్య

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల,జూన్ 10



కడుపునొప్పిని భరించలేక, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిని తలుచుకుంటూ ఓ యువతి ప్రాణాలు తీసుకున్న విషాద సంఘటన తంగళ్ళపల్లి మండల పరిధిలోని ఇంద్రమ్మ కాలనీ టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గజ్జెల్లి రవి కుమార్తె శ్రీవల్లిక (20) బీఎస్సీ నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఏడాది క్రితం ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు అప్పెండిసైటిస్ ఆపరేషన్ చేయించారు. అయినా ఫలితం లేకపోగా, గత పది రోజుల నుంచి ఆమె మళ్లీ కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతోంది.దీంతో తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి మందులు వాడుతున్నారు. అయితే, ఒకవైపు నొప్పి తీవ్రతరం కావడం, మరోవైపు తన వైద్య ఖర్చుల వల్ల తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని ఆమె భరించలేకపోయింది. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని చూసి శ్రీవల్లిక చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

# రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి:జిల్లా ఎస్పీ డా. శబరీష్

### “సురక్షిత – గంజాయి రహిత ఆదర్శ గ్రామం”గా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరం

### హెల్మెట్ తప్పనిసరి -- గంజాయి సమాచారానికి రూ.5,000 నగదు బహుమతి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 10( భారత శక్తి ): హెల్మెట్ ధరించకపోవడం వల్లే అధిక శాతం రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం సంభవిస్తోందని, ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని



జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో “అరైవ్ అలైవ్ “ కార్యక్రమం మరియు రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్. పి, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై గ్రామస్తులకు రహదారి భద్రత, గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్పీ గారు గ్రామ పంచాయతీ సిబ్బందికి హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలు అమలు చేస్తున్న “నో హెల్మెట్ -- నో ఎంట్రీ” నిర్ణయం అభినందనీయమని, ఈ నిర్ణయం తీసుకున్న గ్రామాల సర్పంచులను ప్రత్యేకంగా అభినందించారు.

అదేవిధంగా ‘‘మన ఊరు -- మన బాధ్యత’’ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఈ రోజు నిర్వహించిన గ్రామసభల్లో ఒక్కరోజే 119 గ్రామపంచాయతీలు, 09 వార్డులలో సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామస్తులు కలిసి ప్రత్యేక తీర్మానాలు ఆమోదించడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

“నో హెల్మెట్ -- నో ఎంట్రీ” విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తామని, ట్రాఫిక్ నియమాలను విధిగా పాటిస్తామని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి తమ గ్రామాలను మరింత సురక్షితంగా తీర్చిదిద్దుకుంటామని, గంజాయి అనే మహమ్మారిని తమ గ్రామాల్లోకి రానివ్వబోమని గ్రామ సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు మరియు గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా తీర్మానించడం సంతోషకరమని ఎస్పీ పేర్కొన్నారు.

ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, పాలకవర్గ సభ్యులు, పోలీసు సిబ్బంది మరియు వివిధ శాఖల అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

గంజాయి నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్న ఎస్పీ గారు, గంజాయి విక్రయాలు లేదా సరఫరా గురించి 8712656999 నంబర్‌కు పక్కా సమాచారం అందించిన వారికి రూ.5,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు.

అలాగే మైనర్లు వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సీట్ బెల్ట్ ధరించకుండా ప్రయాణించడం, వాహన నంబర్ ప్లేట్లలో మార్పులు చేయడం వంటి నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోమని హెచ్చరించారు. ట్రాక్టర్ల వెనుక భాగంలో ఎరుపు రంగు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని, వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు.

ఈ గ్రామసభలో రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్, గూడూరు సి.ఐ విజయ్, ఎస్.ఐ గిరిధర్, ఎం.ఆర్.ఓ నాగభవాని, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్ సునీత, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డి మాతృమూర్తి మృతి.. నివాళులర్పించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ(భారత శక్తి)జూన్ 10:

చేర్యాల మండలం ముస్త్యాల గ్రామ మాజీ సర్పంచ్ ఏల్లారెడ్డి మాతృ మూర్తి పెడుతల మల్లమ్మ అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి బుధవారం వెంటనే ముస్త్యాల గ్రామానికి చేరుకున్నారు. మల్లమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ ఎల్లారెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యంగా ఉండాలని చెప్పారు. కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూం ప్రారంభించిన ఎస్ఎస్ అగ్రిటెక్ యజమాని సిరికొండ తిరుపతిరావు.

### పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ఖర్చుకు ఎలక్ట్రికల్ వెహికిల్స్ ఎంతో ఆదా




రేగొండ,జూన్10(భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలో ఎస్ ఎస్ అగ్రిటెక్ ప్రొప్రైటర్ సిరికొండ తిరుపతిరావు ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూంను బుధవారం ప్రారంభించారు.వాసవి మోటార్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ ఎలక్ట్రికల్ వెహికల్స్ షోరూం నందు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఎలక్ట్రికల్ ఆటోలు, ఎలక్ట్రికల్ సైకిల్, అందుబాటులో ఉంటాయని ఈ సందర్భంగా నిర్వహకులు తెలియజేసినారు.కాలానుగుణంగా పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలను గమనించి, వాతావరణ కాలుష్యం కానటువంటి ఎలక్ట్రికల్ వెహికల్స్ లను ఉపయోగించు కోవాలని వినియోగదారులు, ప్రజలకు తెలియజేశారు.ప్రారంభోత్సవ ఆఫర్ గా మొదటి రెండు రోజులు,ప్రతి వెహికల్ పై ఐదువేల తగ్గింపు ధరకు ఇస్తున్నామని,ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ప్రజలు వినియోగించుకోవాలని ఎస్ఎస్ అగ్రిటెక్ తిరుపతిరావు కోరారు. ఎలక్ట్రానిక్ వెహికల్స్ ఉపయోగించుకునే నియోగదారులకు కావాల్సిన ధరలకు మాడల్ వెహికల్ అందుబాటులో ఉంటాయని, ఎలక్ట్రికల్ వెహికల్స్ తో కాలుష్య నివారణతో పాటు, డీజిల్ పెట్రోల్ ఖర్చులు ఎంతో ఆదా అవుతాయని ఇలాంటి అవకాశాలను తీసుకోవాలని ఎస్ఎస్ అగ్రిటెక్ యజమాని తిరుపతిరావు సూచించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు, కస్టమర్లు యువకులు పాల్గొన్నారు.

# పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించిన ప్రధాని నరేంద్ర మోడీ. దేశ ప్రధానిగా 4399 రోజుల రికార్డ్.

### ప్రత్యేక పూజలు నిర్వహించిన బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి.



రేగొండ,జూన్10(భారత శక్తి) భారతదేశ ప్రధాని పండిత్ జవహర్ లాల్ నెహ్రు పాలన రికార్డులను దేశ ప్రధాని నరేంద్ర మోడీ 4399 రోజుల పరిపాలనతో రికార్డు అధిగమించిన సందర్భంగా బిజెపి శ్రేణులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి శజిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు రేగొండ మండలం రూపిరెడ్డిపల్లె రామాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయురారోగ్యాలతో దేశ ప్రజలకు మరిన్ని సేవలందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, బండారి రవి, బిజెపి శ్రేణులు కోరుకున్నారు. పాలన రికార్డును అధిగమించిన ప్రధాని నరేంద్ర మోడీ పాలనపై సర్వత్ర హర్షతికేతనాలు వెల్లువెత్తుతున్న సందర్భంగా.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా

రేగొండ మండలం లోని రూపిరెడ్డి పల్లె గ్రామంలోని , రామాలయంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు 4,399 రోజుల పాటు నిరంతరాయంగా ప్రధానిగా కొనసాగి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పదవీకాల రికార్డును అధిగమించిన సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి రెడ్డి ఆలయంలో ప్రత్యేక అర్చనలు నిర్వహించి, దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం, భారతదేశం మరింత వైభవంగా ఎదగాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం మాట్లాడుతూ, “దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత 12 సంవత్సరాలుగా అభివృద్ధి, సుపరిపాలన, జాతీయ భద్రత, సంక్షేమం, మౌలిక సదుపాయాల విస్తరణ వంటి అనేక రంగాల్లో విశేష సేవలందిస్తూ భారతదేశాన్ని ప్రపంచ వేదికపై మరింత బలమైన దేశంగా నిలబెట్టారని తిరుపతి రెడ్డి అన్నారు.అలాగే, 4,399 రోజుల పాటు నిరంతరాయంగా ప్రధానిగా కొనసాగి చరిత్ర సృష్టించిన ఈ సందర్భం ప్రతి భారతీయుడికి గర్వకారణమని, వికసిత భారత్ లక్ష్య సాధనలో ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు బండారు రవి పిలుపునిచ్చారు.

# ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమైన టీజీఐఐసీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

### ముఖ్య అతిథిగా హాజరై స్పోర్ట్స్ మీట్ ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, హాజరైన ఎం.డి శశాంక

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 10 :

తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా సంబరాలకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో బిజీగా ఉండే ఉద్యోగులకు ఈ క్రీడలు ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయని చెప్పారు. క్రీడల ప్రధాన ఉద్దేశం కేవలం గెలవడం మాత్రమే కాదని, అందరూ కలిసికట్టుగా పాల్గొనడమే అసలైన విజయమని ఆమె పేర్కొన్నారు.ఉద్యోగుల మధ్య ఐక్యత పెంచడానికి, స్నేహభావం చాటడానికిఆరోగ్యకరమైన పోటీ తత్వం పెంపొందించడానికి ఈ పోటీలు తోడ్పడతాయని వివరించారు.క్రీడాకారులందరూ జట్టు స్ఫూర్తితో ఆడాలని సూచించారు.ఈ క్రీడా వేడుకల్లో భాగంగా సంస్థకు చెందిన పురుష, మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం తో స్టేడియం లో సందడి వాతావరణం నెలకొంది. రెండు రోజుల పాటు సాగే ఈ మీట్‌లో అథ్లెటిక్స్, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ మరియు లెమన్ స్పూన్ , స్విమ్మింగ్ వంటి పలు రకాల పోటీలలో పాటు చెస్ , క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఉన్నతాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# అగ్నివీర్‌గా ఎంపికై భైంసాకు గర్వకారణమైన యువకుడు: వాసవి పాఠశాల డైరెక్టర్ బి. రాజేశ్వర్.




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 10(భారత శక్తి ) భైంసా భారత సైన్యంలో ప్రతిష్ఠాత్మకమైన అగ్నివీర్ ఉద్యోగానికి భైంసా పట్టణానికి చెందిన పి. మన్మయ్ ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల డైరెక్టర్ బి రాజేశ్వర్ మాట్లాడుతూ భైంసాలోని వసవి హై స్కూల్‌లో 2022-23 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసిన మన్మయ్, తన కృషి, పట్టుదలతో అగ్నివీర్‌గా ఎంపికై పాఠశాలకు, కుటుంబానికి, పట్టణానికి గర్వకారణంగా నిలిచాడు.

ఈ సందర్భంగా వసవి హై స్కూల్ యాజమాన్యం మన్మయ్‌ను ఘనంగా సన్మానించింది. పాఠశాల ప్రతినిధులు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం కష్టపడి పనిచేస్తే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని వారు పేర్కొన్నారు.

మన్మయ్ సాధించిన ఈ విజయంతో ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తున్నాడని, భవిష్యత్తులో భారత సైన్యంలో ఉత్తమ సేవలు అందించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ హరిప్రసాద్. అడ్మినిస్ట్రేషన్ సురేందర్ రెడ్డి. ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు పలువురు ప్రముఖులు పాల్గొని మన్మయ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# క్రిడిటేషన్ కార్డుల పేరుతో వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు: నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 10 (భారత శక్తి )జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా జరుగుతోందని, ఈ కార్డుల పేరుతో ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా హెచ్చరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రిడిటేషన్ కార్డులు ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇది తీవ్రమైన అంశమని పేర్కొంటూ, ప్రభుత్వం ఉచితంగా జారీ చేసే అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అక్రిడిటేషన్ కార్డుల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే సంబంధిత జిల్లా పౌరసంబంధాల అధికారి (డీపీఆర్వో) విష్ణువర్ధన్ కు లేదా నేరుగా తమకు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# అర్హులకు అక్రిడేషన్ కార్డులు ఇవ్వకుంటే.. పోరాటం తథ్యం!

- జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇవ్వాలి
- హెల్త్ కార్డును ప్రకటించాలి
- ఈ నెలాఖరులో జిల్లా యూనియన్ మహాసభ
- టీయూడబ్ల్యూజే(ఐజేయు )తీర్మానం

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, జూన్ 10:

సంగారెడ్డి జిల్లా లో మిగిలిన జర్నలిస్టులందరికీ తక్షణమే అక్రిడిటేషన్ కార్డులను మంజూరు చేయాలని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజే-ఐజేయు) సంగారెడ్డి జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం నాడు సంగారెడ్డిలో యూనియన్ జిల్లా కార్యవర్గ అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కె ఫైజల్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సిద్ధన్న పాటిల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా విభాగం అధ్యక్షుడు అనిల్ కుమార్ ఈ సమావేశానికి హాజరయ్యారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇంటి స్థలాల సమస్యపై, హెల్త్ కార్డుల అంశంపై చర్చించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలం కేటాయించాలని తీర్మానించారు. అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు మాదిరిగా హెల్త్ కార్డును ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 252 ప్రకారం ఆక్రిడిటేషన్ కార్డుల జారీలో చాలా ఆలస్యం అవుతుందని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. అయినప్పటికీ తమ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామనారాయణ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్ అహ్మద్ ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ని కలిసి అనేకసార్లు విన్నవించడం జరిగిందని చెప్పారు.దీని ఫలితంగానే అనేక సవరణలు వచ్చాయని, దానివల్లనే చాలామందికి అక్రిడేషన్ కార్డులు జారీ అయ్యాయని వివరించారు. మిగిలిన వారికి కూడా ఎలాంటి కొర్రీలు వేయకుండా తక్షణమే కార్డు మంజూరు చేయాలని ఈ సమావేశంలో డిమాండ్ చేశారు. తమ సంఘానికి పోరాటం కొత్త కాదని, జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక సంఘం గా టీయూడబ్ల్యూజే ఉన్నదని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమమే తమ సంఘం ధ్యేయమని ఆయన చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అన్నారు.

ఈ నెలాఖరులో జిల్లా మహాసభను నిర్వహిస్తామని, జిల్లా కమిటీని ఎన్నుకుంటామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే ఫైసల్ తెలిపారు. యూనియన్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ప్రధాన కార్యదర్శి విష్ణు ప్రసాద్ సూచించారు.

ఇతర ముఖ్య నేతలు అక్రమ్ పటేల్, మసూద్ ఖాన్, శ్రీనాథ్, బాసిత్, అన్వర్ హుస్సేన్, హాజీ, మినాజ్, సిద్ధిక్,

విష్ణు వర్ధన్, జోగిపేట భూమన్న, యాదగిరి, అబ్దుల్ మతిన్, విల్సన్, అంజయ్య ,సంగమేశ్ వెంకటేష్ గౌడ్ సిద్దు, రమేష్ గౌడ్, సత్తార్,తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాలం వరదలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 10(భారత శక్తి )నిర్మల్ పట్టణంలో వర్షాకాలం భారీ వర్షాలు కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలువ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



పట్టణంలో గతంలో వర్షాలు కురిసి నీటిమయమైన శివాజీ చౌక్ మంచిర్యాల చౌరస్తా, విశ్వనాథ్ పేట్, సిద్దాపూర్ వాగు ప్రాంతాలను బుధవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ వర్షాకాలంలో పట్టణంలో ఎక్కడ కూడా రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండరాదని పేర్కొన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అధికారులు వర్షాకాలం పూర్తయ్యేంతవరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పట్టణ ప్రజలకు వరద నీటి వల్ల ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. డ్రైనేజీలు, నాళాలు పరిశీలించారు. ఎప్పటికప్పుడు పూడికలు తీసివేస్తూ నీటి ప్రవాహానికి ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు.

ఈ పరిశీలనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జనగామ పట్టణం మూడవ వార్డు అభివృద్ధికి నిధులు ఇవ్వాలని జిల్లా ఇన్చార్జి మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి వినతి.

జనగామ(భారత శక్తి )జూన్ 10:



జనగామ పట్టణంలోని మూడవ వార్డు లో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సిసి అంతర్గత రోడ్లు వార్డులోని ప్రధాన కూడలిలో ఐమాక్స్ లైట్లు వార్డులో ఉన్న గార్లకుంటను పార్కుగా అభివృద్ధి చేయుటకు ప్రత్యేక స్పెషల్ ప్యాకేజ్ ప్రకటించి అభివృద్ధి చేయాలని జిల్లా ఇన్చార్జి మినిస్టర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని హైదరాబాదులోని మినిస్టర్ క్వార్టర్స్ లో మూడో వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి మెమోరాండం ఇచ్చారు. ఈసందర్భంగా కౌన్సిలర్ మినిస్టర్ దృష్టికి జనగామ పట్టణంలో 3వ వార్డు పూర్తిగా దిగువ లోతట్టు ప్రాంతంగాఉంటుంది. గవర్నమెంట్ హాస్పిటల్ బాణాపురం రైల్వే స్టేషన్ పాత బీట్ బజార్ నాగులకుంట నెహ్రూ పార్క్ ఏరియా కురుమవాడ సాయి నగర్ తదితర ప్రాంతాల నుండి ప్రజలు వాడిన విసర్జించిన మురుగునీరు, వర్షపు నీరు ఈవార్డు నుండే ప్రవహిస్తుంది.ఇక్కడ సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ఇరుకు మోరీలలో చెత్తాచెదారం ప్లాస్టిక్ వస్తువులు చిక్కుకుపోయి ఇండ్లమధ్యలో మురుగునీరు నిలిచి ప్రజలు తీవ్రమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని వివరించారు.ఈవార్డులో మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు పిల్లల చదువుల కోసం గ్రామాల నుండి వచ్చి ఇల్లు కట్టుకున్న రైతులు ఎక్కువగా నివసిస్తుంటారు. హైదరాబాదు రోడ్డు సూర్యాపేట మెయిన్ రోడ్డు బస్టాండు కలెక్టర్ ఆఫీసుకు అతి చేరువలో ఉండి అభివృద్ధి చెందిన వార్డుగా పైకి కనబడుతున్నప్పటికిని అంతర్గతంగా తీవ్రమైన సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే బురద వల్ల పాములు విషపు పురుగులు తేళ్లు ఇల్ల మధ్యలోకి ఇండ్లలోకి వచ్చిన ఘటనలు అనేకం ఉన్నాయని ఈసమస్యల పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్పెషల్ ప్యాకేజీ కింద మోడల్ కాలనీగా వార్డును అభివృద్ధి అంతర్గత రోడ్లు ప్రధానవీధులలో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించాలని కోరారు.


మూడవ వార్డును కలెక్టర్ ఆఫీసును ఆనుకొని ఉన్న గార్లకుంట ప్రభుత్వ శిఖం భూమిలో దట్టమైన ముండ్ల పొదలు చెట్లు పెరిగిపోయి ఉన్నాయి.దీనిలో పందులు భయంకరమైన పాములు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయని వీటివల్ల ప్రజలకు ప్రమాదం పొంచి ఉన్నది.చుట్టూ రియల్ ఎస్టేట్ వెంచర్ల వల్ల కుంట కొంతమేరకు ఆక్రమణకు గురికా పడ్డది.కుంట క్రింది భాగంలో వ్యవసాయక పరివాహక ప్రాంతం కూడా ఏమీ లేదు కలెక్టర్ ఆఫీసు ఉంది.కాబట్టి కుంటను పార్కుగా అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావడం కోసం చర్యలు చేపట్టాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈసందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈవిషయాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా నివేదిక రిపోర్టు తెప్పించుకొని పార్కుగా చేసే అంశాన్ని పరిశీలిస్తామని అలాగే వార్డు అభివృద్ధి కోసం కూడా నిధుల ఏర్పాటు ప్రక్రియకు కొద్ది సమయం తీసుకోనైనా అభివృద్ధికి సహకరిస్తామని చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొట్ల శేఖర్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు భానోతు ధర్మభిక్షం నాయక్, మూడవ వార్డు సిపిఎం శాఖ కార్యదర్శి గుండు శశిరేఖ తదితరులు ఉన్నారు.

# సెన్సార్ బోర్డు సభ్యురాలిగా గీతం అధ్యాపకురాలు

## - సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్, హైదరాబాద్ రీజియన్ లో నియామకం

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, జూన్ 10 :

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ మైథిలి మారట్ అనూప్ ను, భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీ.బీ.ఎఫ్.సీ), హైదరాబాదు రీజియన్ సలహా మండలి సభ్యురాలిగా నియమించింది.సీ.బీ.ఎఫ్.సీ., హైదరాబాదు ప్రాంతీయ అధికారి డాక్టర్ రాహుల్ గౌలికర్ జారీచేసిన అధికారిక ప్రకటన ప్రకారం, డాక్టర్ మైథిలి మూడేళ్ల కాలానికి లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు, ఏది ముందు అయితే అది, సలహా మండలిలో సేవలందిస్తారు.డాక్టర్ మైథిలి మారట్ అనూప్ ఒక ప్రఖ్యాత ప్రదర్శన కళాకారిణి, విద్యావేత్త, పరిశోధకురాలు. ఆమె రెండు దశాబ్దాలకు పైగా భారతీయ శాస్త్రీయ నృత్యానికి, ముఖ్యంగా మోహినియాట్టానికి అంకితభావంతో సేవలందిస్తున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్), దూరదర్శన్- రెండింటిలోనూ ప్యానెల్ సభ్యురాలిగా ఉన్న ఆమె, తన కళా నైపుణ్యానికి, పాండిత్యపరమైన కృషికి విస్తృత గుర్తింపు పొందారు.



ఆమె విశిష్టమైన వృత్తి జీవితంలో అనేక ప్రశంసలు పొందిన ఏకపాత్రాభినయ నాటకాలు, నృత్య చిత్రాలు, 'ప్రేమ్ రాక్స్ రస; పూతప్పాట్టు, దుశాల' వంటి ప్రముఖ నాటకాలలో ప్రధాన పాత్రలు ఉన్నాయి. ప్రదర్శన కళల రంగానికి ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా, తెలంగాణ సంగీత నాటక అకాడమీ ఆమెను ప్రతిష్టాత్మక 'రుక్మిణి దేవి అరుండేల్ అవార్డు 2025'తో సత్కరించింది.తన కళాత్మక విజయాలతో పాటు, డాక్టర్ మైథిలి ఐఐటీ బొంబాయి నుంచి పిహెచ్.డి. పట్టా పొందారు. హైదరాబాదులోని గీతంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. ఆమె రచయిత్రి కూడా. పరిశోధన, బోధన, సృజనాత్మక అభ్యాసం ద్వారా నృత్యం, నాటకం, సాంస్కృతిక అధ్యయన రంగాలను ఆమె రచనలు ముందుకు తీసుకువెళ్తున్నాయి.గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఇన్-ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు డాక్టర్ మైథిలి నియామకంపై హర్షం వెలిబుచ్చారు. ఇది విశ్వవిద్యాలయానికి, దాని విద్యా సమాజానికి (అకడమిక్ కమ్యూనిటీ) గర్వకారణమని వారు అభివర్ణించారు.

# కనగర్తి నూతన గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ తాళం.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 10:

కోనరావుపేట మండలం కనగర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనానికి కాంట్రాక్టర్ అండెం మల్లారెడ్డి తాళం వేశారు..



గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులు పూర్తి చేసి రెండేళ్లు గడుస్తున్నా తనకు రావాల్సిన రూ.1.50 లక్షల బిల్లు ఇప్పటికీ చెల్లించలేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పటి సర్పంచ్, వార్డు సభ్యులు అధికారులు బిల్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు డబ్బులు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని తెలిపారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం వల్ల తాను నష్టపోయానని వాపోయారు.

తనకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని అధికారులను వేడుకుంటున్న మల్లారెడ్డి, బిల్లు చెల్లించిన తర్వాతే గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించుకోవాలని స్పష్టం చేశారు.

ఈ ఘటన గ్రామంలో చర్చనీయాంశంగా మారగా, సంబంధిత అధికారులు ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

గ్రామాభివృద్ధి కోసం నిర్మించిన పంచాయతీ భవనం... ఇప్పుడు బకాయిల వివాదంతో వార్తల్లో నిలిచింది.

రెండు సంవత్సరాలుగా బిల్లు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ ఏకంగా భవనానికి తాళం వేయడం కలకలం రేపుతోంది. తనకు రావాల్సిన రూ.1.50 లక్షలు చెల్లించే వరకు భవనం ప్రారంభించవద్దని కాంట్రాక్టర్ తెలిపారు.

# తెలంగాణ పథకాలు దేశానికే రోల్ మోడల్: విప్ ఆది శ్రీనివాస్.

## వేములవాడ మున్సిపాలిటీతో పాటు మల్లారం గ్రామ సభల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ.

భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 10:అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఆశయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వేములవాడ మున్సిపల్ పరిధిలోని



11, 24 వార్డుల్లో నిర్వహించిన ప్రత్యేక వార్డు సభల్లో వేములవాడ రూరల్ మండలం మల్లారం గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. సభలో వర్షాకాల ముందస్తు చర్యలు, జల సంరక్షణ, వన మహోత్సవం, సురక్షిత తాగునీరు, పారిశుద్ధ్యం, పంటల మార్పిడి, ఓటరు జాబితా సవరణ, మహిళల రక్షణ, భరోసా కేంద్రం తదితర అంశాలపై ప్రజలతో సుదీర్ఘంగా చర్చించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ అభివృద్ధి పనులపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించడానికే ఈ ప్రగతి ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, డ్రైనేజీలను ముందే శుభ్రం చేయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్, వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయవద్దని ప్రజలను కోరారు.ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఆది శ్రీనివాస్ కొనియాడారు.ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ తెలంగాణలో అమలు చేస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకంపై, అలాగే కేరళ ముఖ్యమంత్రి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంపై మొదటి సంతకాలు చేయడం మన పథకాల విశిష్టతకు నిదర్శనమన్నారు. రాష్ట్రంలో తాము చేపట్టిన కుల గణన చూసే కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దిగివచ్చి దేశంలో జనగణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని విమర్శించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామని స్పష్టం చేశారు. గతంలో కేవలం బేస్ మెంట్, గోడలు కట్టుకుని ఆగిపోయిన వారికి కూడా ఇందిరమ్మ ఇళ్ల కింద ఆర్థిక సహాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారని తెలిపారు. త్వరలోనే రెండో దశ ఇళ్ల మంజూరు ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా ఆయిల్ పామ్, సన్న వడ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాల వంటి లాభదాయక పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు రవాణా ఇబ్బందులు లేకుండా సిద్దిపేట జిల్లా నర్మెటలో పరిశ్రమ అందుబాటులో ఉందన్నారు. జగిత్యాల జిల్లా పొలస తరహాలోనే మద్రిపల్లిలో 40 ఎకరాల్లో ప్రత్యేక కేంద్రాన్ని నిర్మిస్తున్నామని, దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను రూ. 150 కోట్లతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టామని విప్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఈ పనులకు శంకుస్థాపన చేశారని, మరో వెయ్యి ఏళ్లపాటు ఆలయం చెక్కుచెదరకుండా ఉండేలా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, ఆర్డీవో కేఎస్బీ కుమారి, మున్సిపల్ కమిషనర్ లోకేష్, డీఎస్పీ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి లక్ష్మి రాజం, మల్లారం సర్పంచ్ అర్పితా రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు,విభిన్న శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Published & Printed at Sri Muktheswara Publications, D.No. 4-2-252,
Subhash Nagar, Hanmakonda, Warangal – 506001, Telangana. Fax: 040-24054446 ,Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, APTEL/2013/50560,Editor: Kesaram Penta Reddy